
ఏపీ ప్రభుత్వం గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదుర్చుకుని విశాఖను టెక్నాలజీ కేంద్రంగా మార్చేందుకు బాటలు వేసింది. సీఎం చంద్రబాబు, లోకేష్ దూరదృష్టితో 1.88 లక్షల ఉద్యోగాలు, గ్లోబల్ గుర్తింపు రాష్ట్రానికి రానున్నాయి. ఇది అభివృద్ధి నూతన యుగానికి శ్రీకారం.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శుక్రవారం 17.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 181 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00





# స్వర్ణాంధ్రతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం

## గూగుల్ రాకతో ప్రపంచమంతా ఏపీ వైపు చూస్తోంది

## ఆత్మనిర్భర్ భారత్ కు సరికొత్త శక్తిగా ఏపీ

## చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి

## నారా లోకేష్ సారథ్యంలో పండుగలా జీఎస్టీ సంస్కరణల ప్రచారం

## కర్నూలులో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోదీ

## ఏపీలో రూ.13,429 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ప్రధాని



**కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్) :** వికసిత్ ఏపీతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం అవుతుందని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే జీఎస్టీ సంస్కరణలకు సార్థకత చేకూరుతుందని స్పష్టం చేశారు. వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటివి సాకారం కావడంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. ఏపీ యువత ఎంతో చైతన్య కలిగిన వారని... సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వంటి వారి నేతృత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో వెళ్తోందని... కేంద్రం కూడా పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సహకరిస్తుందని ప్రధాని చెప్పారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గురువారం నన్నూరు చెక్ పోస్ట్ సమీపంలో జరిగింది. శ్రీశైలంలో మల్లిఖార్జున స్వామి వారిని, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అనంతరం ప్రధాని కర్నూలు చేరుకున్నారు. కర్నూలులో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ జీఎస్టీ బచత్ ఉత్సవ్ పై ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికకు చేరుకున్న ప్రధానికి మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. మిగతా 2లో...

# జీఎస్టీ 2.0 సామాన్య ప్రజలకు ఊరటనిచ్చే సంస్కరణ



**కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్) :** 'దేశంలో పన్నుల భారం పెరగడమే తప్ప ఎప్పుడూ తగ్గిన దాఖలాలు ఉండవు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణతో పేదలు, సామాన్యులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుంది. విద్యా, వైద్యం ఖర్చుల భారం నుంచి ప్రజలకు ఊరట లభిస్తుంద'ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. జీఎస్టీ 2.0తో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ. 20 వేల వరకు ఆదా అవుతుందన్నారు. ఆత్మ నిర్భర భారత్ ద్వారా ప్రపంచ పటంలో దేశాన్ని నిలబెట్టిన మోదీ కృషితో దేశంలో, రాష్ట్రంలో పెట్టుబడులు వెల్లు వెల్లువెత్తుతున్నాయన్నారు.

గూగుల్ లాంటి అతిపెద్ద ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ కి వచ్చాయని తెలిపారు. ఎలాంటి ఫలితం ఆశించకుండా దేశ సేవే పరమావధిగా పని చేస్తున్న కర్మ యోగి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అని అభివర్ణించారు. కర్నూలు నగర శివారు నన్నూరు వద్ద నిర్వహించిన సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ , రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మిగతా 2లో...

# డబుల్ ఇంజన్ సర్కార్ ...

# రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా !

- మోదీ విజయం భారత్ విజయం... అదే మన విజయం
- 21వ శతాబ్దం నరేంద్ర మోదీదే
- కేంద్ర సహకారంతో రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు
- జీఎస్టీ 2.0తో ప్రజలకు పొదుపూ-భరోసా
- త్వరలో రాయలసీమకు హైకోర్టు బెంచ్
- సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు
- బీహార్ లో ఎన్డీఏ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేసిన సీఎం
- ప్రధాని మోదీతో కలిసి శ్రీశైల మహాక్షేత్రాన్ని దర్శించుకున్న ముఖ్యమంత్రి
- రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధాని మోదీ



**కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్రంలో రాష్ట్రంలోని ఎన్డీఏ డబుల్ ఇంజన్ సర్కార్ తో ఆంధ్రప్రదేశ్ కు రెట్టింపు ప్రయోజనాలు దక్కుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు వస్తున్నాయని సీఎం అన్నారు. గురువారం కర్నూలులో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్, బచత్ ఉత్సవ్ బహిరంగ సభలో సీఎం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో దేశ ప్రగతి వేగాన్ని పెంచటంలో ప్రధాని మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారని సీఎం ప్రశంసించారు. మిగతా 2లో...

# ఏపి నెం.1 కావడం గ్యారంటీ



**కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ అన్నా, ఇక్కడి ప్రజలు అన్నా ప్రధాని మోడీజీకి అపారమైన ప్రేమ. 16నెలల్లో నాలుగుసార్లు రాష్ట్రానికి వచ్చారు, మనం అడిగిన అన్ని కోరికలు తీరుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో నంబర్ 1 కావాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. గుజరాత్ లో ప్రభుత్వ కొనసాగింపు వల్లే ఆ రాష్ట్రం అభివృద్ధి చెందిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ వేడుకల్లో భాగంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు చెక్ పోస్టు సమీపంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... స్థిరమైన అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వ కొనసాగింపు అనేది ముఖ్యం. ప్రధాని నరేంద్ర మోడీ వరుసగా మూడుసార్లు ప్రధాని కావడం వల్లే ప్రపంచంలో 10నుంచి 4వ అతి పెద్ద ఎకానమీగా అభివృద్ధి చెందింది. సంక్షేమం - అభివృద్ధి ప్రజా ప్రభుత్వానికి జోడెద్దుల బండి లాంటివి, కూటమి ప్రభుత్వాన్ని కొనసాగిస్తే ఏపీ అన్ని రంగాల్లో నంబర్ 1 కావడం గ్యారంటీ. పవర్ ఫుల్ పీపుల్ మేక్స్ పవర్ ప్లేసెస్. పౌరుషాల గడ్డ ఉమ్మడి కర్నూలు జిల్లా. బ్రిటిష్ వాళ్ళను గడగడ లాడించిన ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి గారు, ముత్తుకూరు గౌడప్ప గారు జన్మించిన గొప్ప నేల ఉమ్మడి కర్నూలు జిల్లా. కర్నూలు జిల్లా ప్రజల రాజసం కొండారెడ్డి బురుజు.

సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ తో దసరా, దీపావళి కలిపి ఒకేసారి వచ్చినట్లుగా ఉంది. అలాంటి సూపర్ పండుగను 140 కోట్ల ప్రజలకు అందించారు మన ప్రధాని నమో. పేద, మధ్య తరగతి ప్రజల పై పన్నుల భారం తగ్గించారు. ట్యాక్స్ తగ్గడం వలన ఒక్కో పేద, మధ్య తరగతి కుటుంబానికి ఏడాదికి 15 వేలు మిగులుతుంది. జీఎస్టి తగ్గించాలని నిర్ణయం తీసుకున్నప్పుడు అధికారులు ప్రభుత్వానికి వేల కోట్ల నష్టం వస్తుందని చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా పర్వాలేదు దేశానికి లాభం జరుగుతుందని నమో అన్నారు. నిత్యావసరాలు, విద్య, వైద్యం, వ్యవసాయం... ఇలా పేద, మధ్య తరగతి ప్రజలు ఉపయోగించే ప్రతి వస్తువు పై జీఎస్టీ తగ్గించారు. జీఎస్టీ తగ్గడంతో ప్రజలు పండగ చేసుకుంటున్నారు. పేద ప్రజల చిరునవ్వే మన నమో కి పండగ. పేద ప్రజల ఆనందమే మన నమో కి పండగ. మిగతా 2లో...

# మీ నాన్న మాదిరిగా ఎదుగుతావు



**కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ..ఆనందం అంతా ఇంతా కాదు. ప్రధాని మోదీ పలకరించి.. నైస్.. స్లిమ్ గా మారావు. బరువు కూడా తగ్గావు. మీ నాన్న చంద్రబాబు మాదిరిగా ఎదుగుతావు, అని ప్రధాని నరేంద్ర మోదీ అనగా.. మంత్రి లోకేష్ భావోద్వేగానికి గురయ్యారు. థ్యాంక్యూ సార్ అని బదులిచ్చారు. ఈ ఘటన ఈ రోజు ప్రధాని ఓర్వకల్లుకు వచ్చారు.


విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలకటానికి రాష్ట్ర గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్.. మంత్రులు సిద్ధంగా ఉన్నారు. ప్రధాని మోదీ విమానం నుంచి దిగగానే వీరందరూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అందరినీ ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా లోకేష్ తో వ్యక్తిగతంగా ప్రధాని వ్యాఖ్యలు చేశారు. మీ నాన్నలా తయారయ్యావు అనగానే ఏపీ సీఎం ముసి ముసి నవ్వులు నవ్వారు.

# ఏపీలో పర్యటించడం ఎంతో ఆనందంగా ఉంది

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీలో పర్యటించడం ఎంతో ఆనందంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పరిశ్రమలను బలోపేతం చేసి పౌరులను శక్తిమంతం చేసేలా అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కనెక్టివిటీని పెంచే కార్యక్రమంలో పాల్గొనడం గర్వకారణమన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను స్వాభిమానం, సంస్కృతిల భూమిగా మోదీ అభివర్ణించారు. ఇది విజ్ఞానశాస్త్రం ఆవిష్కరణల కేంద్రం అని అన్నారు. ఈ రోజు స్వచ్ఛ శక్తి నుంచి సంపూర్ణ శక్తి ఉత్పత్తి వరకు భారత్ ప్రతి రంగంలో కొత్త రికార్డులను సృష్టిస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా మల్టీ-మోడల్ మౌలిక వసతులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గ్రామాల నుంచి నగరాలకు, నగరాల నుంచి పోర్టుల వం-కు కనెక్టివిటీపై తాము బలంగా దృష్టి సారిస్తున్నామన్నారు.

ఈ రోజు భారత్, ఆంధ్రప్రదేశ్‌ల వేగం, స్థాయిని ప్రపంచం చూస్తోందని గూగుల్



భారతదేశపు మొదటి ఏఐ హబ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో స్థాపించబోతోందని తెలిపారు. అలాగే ప్రపంచం భారత్‌ను 21వ శతాబ్దపు కొత్త తయారీ కేంద్రంగా చూస్తోందని తమ ప్రభుత్వ దృష్టి అంతా పౌర కేంద్రిత అభివృద్ధిపైనే ఉందన్నారు. నిరంతర సంస్కరణల ద్వారా ప్రజల జీవితాలను మరింత సులభతరం చేస్తున్నామని వెల్లడించారు.

సోమనాథుని భూమిగా ఉన్న గుజరాత్‌లో జన్మించానని బాబా విశ్వనాథుని కాశీలో సేవ చేస్తున్నానని, జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం క్షేత్రంలో మల్లిఖార్జున స్వామి ఆశీర్వాదం పొందడం ఇవన్నీ తనకు లభించిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని మోదీ అన్నారు. శివాజీ స్ఫూర్తి కేంద్రంలో నివాళులు అర్పించే అవకాశం పొందానని ఛత్రపతి శివాజీ మహారాజుకు నమస్కరిస్తున్నానని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తెలిపారు.

**ప్రధాని మోదీకి ధన్యవాదాలు :** నేడు కర్నూలులో 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' కార్యక్రమం జరుపుకుని దాదాపు రూ. 13,430 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయటం ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ ప్రజలకు ఇది రెట్టింపు ఆనందాన్ని కలిగించిన రోజన్నారు. ఈ కీలక కార్యక్రమాలకు పునాది వేసినందుకు పీఎం నరేంద్ర మోదీకి ఎక్స్ వేదికగా సీఎం ధన్యవాదాలు తెలిపారు.

**మోదీ నిరంతర కృషి చరిత్రలో నిలిచిపోతుంది :** ఆంధ్రప్రదేశ్‌కు ఒక కొత్త నవోదయం మొదలైందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. మిగతా 2లో...

# రూ.13,429 కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని శ్రీకారం

**కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాని నరేంద్ర మోదీ సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ సభా వేదికగా వివిధ ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 13,429 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. వర్చువల్ విధానం ద్వారా వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, రెండు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు ప్రధాని. వీటిలో రూ. 9449 కోట్ల విలువైన 5 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయగా.. రూ. 1704 కోట్ల విలువైన 8 అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ. 2276 కోట్ల విలువైన 2 ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు ప్రధాని మోదీ. మిగతా 2లో...



# రూ. 200 కోట్లతో 4 స్టార్ దసపల్లా హోటల్..

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతిలో అభివృద్ధి దూసుకుపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర రాజధానిలో పెట్టుబడులు పెట్టాలని వివిధ కంపెనీలను ఆహ్వానించారు. ఈ మేరకు పలు సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టాయి. తాజాగా రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు హోటల్ దసపల్లా గ్రూపు ముందుకు వచ్చింది. రూ. 200 కోట్లతో 4 స్టార్ హోటల్ నిర్మించాలని దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వంతో చర్చలు జరిపింది. ఇందుకు సానుకూలంగా స్పందన రావడంతో హోటల్ నిర్మాణం చేపట్టేందుకు రెడీ అయింది. మిగతా 2లో...



# స్వర్ణాంధ్రతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం

(మొదటి పేజీ తరువాయి)

హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ వేదికపైకి చేరుకున్నారు. ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా వచ్చిన ముగ్గురు నేతలకు భారత్ మాతాకీ జై అంటూ మువ్వెన్నల జెండాలతో ప్రజలు స్వాగతం పలికారు. బహిరంగ సభలో జీఎస్టీ సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ..."ఆంధ్రప్రదేశ్ శాస్త్రసాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం, యువత ఎంతో చైతన్యవంతులు. ఏపీలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి నేతలు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. గత 16 నెలల్లో డబుల్ ఇంజన్ సర్కారు వల్ల ఏపీలో ప్రగతి వేగంగా జరుగుతోంది. ఢిల్లీ, అమరావతిలు రెండూ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళ్తున్నాయి. దేశ ఆర్థిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ఓ కీలక ప్రాంతంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశగా నడుస్తోంది. భారత్ దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రగతి వేగాన్ని ప్రపంచం గమనిస్తోంది. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజం ఏపీలో అతిపెద్ద పెట్టుబడిని ప్రకటించింది. దేశపు తొలి అతి పెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అమెరికా వెలుపల భారీ పెట్టుబడితో ఏపీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ పెడుతున్నట్టు గూగుల్ సీఈఓ నాతో చెప్పారు. డేటా సెంటర్, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ లాంటి అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఈ కేంద్రంలో ఏర్పాటు కాబోతున్నాయి. ప్రపంచ దేశాలను కలుపుతూ వేయనున్న సబ్ సీ కేబుల్ ద్వారా తూర్పు తీరం బలోపేతం అవుతుంది. విశాఖలో ఏర్పాటు కానున్న కనెక్టివిటీ హబ్ భారత్ కే కాదు ప్రపంచానికి సేవలందిస్తుంది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు విజన్ ను అభినందిస్తున్నాను. 21వ శతాబ్దపు మాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారత్ ఉత్పత్తి కేంద్రంగా రూపు దిద్దుకుంటోంది. ఆత్మనిర్భర్ భారత్ లో ఏపీ కీలకంగా మారింది." అని ప్రధాని అన్నారు.



**ఆంధ్ర ప్రదేశ్ ప్రగతిని కాంగ్రెస్ నాశనం చేసింది :** "కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ ప్రగతిని నాశనం చేశాయి. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఏపీ ప్రగతి ద్వారాలు తెరుచుకుని వేగంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. దేశ ప్రగతికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చాలా కీలకం. రాయలసీమ అభివృద్ధితోనే ఏపీ అభివృద్ధి ఉంది. కర్నూలులో ప్రారంభించిన ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంత ప్రగతికి సరికొత్త ద్వారాలు తెరుస్తాయి. పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ఏపీ వేగవంతమైన అభివృద్ధి కోసం కొప్పర్తి –ఒర్వకల్ పారిశ్రామిక నోడ్ల ద్వారా వచ్చే పెట్టుబడులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రాయలసీమలోని ప్రతి జిల్లాలోనూ ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి. ఆత్మనిర్భర్ భారత్ కు సరికొత్త శక్తిగా ఏపీ తయారవుతోంది. కృష్ణా జిల్లా నిమ్మకూరులో రక్షణ రంగానికి చెందిన నైట్ విజన్ గాగుల్స్, క్షిపణుల సెన్సార్లు, డ్రోన్ గార్డులను తయారు చేసే సంస్థ ఏర్పాటు కావడం ముదావహం. రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతులు కూడా చేసేందుకు ఆస్కారం ఇస్తుంది. ఆపరేషన్ సింధూర్ లో దేశంలో తయారైన ఉత్పత్తుల బలం ఏమిటో చూశాం. కర్నూలును భారత్ డ్రోన్ హబ్ తయారు చేయాలని ఏపీ నిర్ణయించటం సంతోషం. ఆపరేషన్ సింధూర్ ద్వారా డ్రోన్ల పనితీరు ఏమిటో తెలియచెప్పింది. డ్రోన్ల తయారీ ద్వారా కర్నూలు భారత్ కు ఓ గర్వకారణంగా నిలుస్తుంది." అని ప్రధాన మంత్రి చెప్పారు.

**ప్రారంభించిన ప్రాజెక్టులు ప్రగతికి మార్గాలు:** "ఈ ప్రాజెక్టులన్నీ రాష్ట్రంలో కనెక్టివిటి బలోపేతం కావటంతో పాటు పరిశ్రమలను బలోపేతం చేస్తాయి. ఈ ప్రాజెక్టులతో కర్నూలుతో పాటు పరిసర ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుంది. దేశానికైనా, రాష్ట్రానికైనా ఇంధన భద్రత అవసరం. ప్రస్తుతం 3 వేల కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టులను ప్రారంభించాం. తద్వారా దేశ ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బ్లాక్ అవుట్ లాంటి విద్యుత్ సంక్షోభాలు వచ్చాయి. తలసరి విద్యుత్ వినియోగం 1000 యూనిట్ల కంటే తక్కువే ఉంది. చాలా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూడా లేని పరిస్థితి. ఇప్పుడు క్లీన్ ఎనర్జీ నుంచి మన అవసరాలకు తగినంత ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తున్నాం. 1400 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగం ఇప్పుడు దేశంలో ఉంది. తగినంత విద్యుత్ దేశ ప్రజలకు లభ్యం అవుతోంది. శ్రీకాకుళం నుంచి ఆంగుల్ వరకూ గ్యాస్ పైప్ లైన్ ను జాతికి అంకితం చేశాం. 20 వేల సిలెండర్ల సామర్థ్యంతో ఇండేన్ బాటిలింగ్ ప్లాంట్ ను చిత్తూరులో ప్రారంభించాం. మల్టీమోడల్ ఇన్ఫ్రా ప్రాజెక్టులతో కనెక్టివిటీ పెంచుతున్నాం. సబ్బవరం నుంచి షీలా నగర్ వరకూ కొత్త హైవేతో కనెక్టివిటీ పెరిగింది. రైల్వే రంగంలో కొత్త యుగం ప్రారంభమైంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందేలా ప్రాజెక్టులను ప్రారంభించుకున్నాం. స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తైన 2047 నాటికి దేశం వికసిత్ భారత్ గా తయారవుతుంది. వికసిత్ భారత్ 2047 సాధన సంకల్పానికి స్వర్ణాంధ్ర లక్ష్యం మరింత బలం అందిస్తుంది." అని మోదీ వెల్లడించారు.

**ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం:** "పౌరులకు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనేది ఎన్డీఏ ప్రభుత్వ నినాదం. ఈజ్ ఆఫ్ లివింగ్ అనే అధ్యాయం దేశంలో ప్రారంభమైంది. ప్రజల జీవితాలను సులభతరం చేసే సంకల్పంతో ఎన్డీఏ పని చేస్తోంది. 12 లక్షల ఆదాయం ఉన్న ప్రతీ ఒక్కరికి పన్ను లేకుండా చేశాం. వృద్ధుల కోసం ఆయుష్మాన్ భారత్ లాంటి సదుపాయాలు కల్పిస్తున్నాం. సరిగ్గా నవరాత్రి ముందు జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి తీసుకువచ్చాం. ప్రజలపై పన్నుల భారం తొలగించాం. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జీఎస్టీ పొదుపు ఉత్సవాన్ని పండుగలా చేసుకున్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరిట కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయం. ఈ జీఎస్టీ సంస్కరణల వల్ల రూ. 8 వేల కోట్ల మేర ప్రజలకు ఆదా అవటం సంతోషం. కానీ ఆ ప్రయోజనాలు అందరికీ అందాల్సి ఉంది... అప్పుడే అది సఫలమైనట్టు. 21 వ శతాబ్దం భారత దేశానిది, 140 కోట్ల మంది భారతీయులది." అని ప్రధాని చెప్పారు.

**శ్రీశైల దర్శనం ఆనందాన్నిచ్చింది :** "ఢిల్లీ నుంచి నుంచి నేరుగా కర్నూలు ఎయిర్ పోర్టుకు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా... వివిధ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. కర్నూలు ఎయిర్ పోర్టు నుంచి సీఎం, డెప్యూటీ సీఎంలతో కలిసి శ్రీశైల దేవస్థానానికి హెలీకాప్టరులో వెళ్లారు. దేవస్థానంలో కొలువైన శ్రీశైల భ్రమరాంబిక, మల్లిఖార్జున స్వామి వార్లను ప్రధాని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైల క్షేత్రం విశేషాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రధానికి వేదశీర్వాచనాలిచ్చి... తీర్థ ప్రసాదాలు అందించారు. ఆ తర్వాత ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని ప్రధాని సహా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సందర్శించారు. అక్కడున్న శిల్పాలను, చిత్రపటాల్లోని విశేషాలను ప్రధానికి నిర్వాహకులు వివరించారు. అనంతరం భ్రమరాంబిక గెస్ట్ హౌసులో ప్రధాని భోజన విరామం తీసుకున్నారు. ఆ తర్వాత హెలీకాప్టర్ ద్వారా కర్నూలులో సూపర్ సేవింగ్స్–సూపర్ జీఎస్టీ బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన స్కూలు విద్యార్థులు అందించిన చిత్రపటాన్ని ప్రధాని అందుకున్నారు. రాయలసీమ ప్రాంతంలో కొలువైన అహోబిలం నర్సింహస్వామి, మహా నందీశ్వరుడు, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ప్రాశస్త్యాన్ని ప్రధాని తన ప్రసంగంలో గుర్తు చేసుకున్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో తొలి జ్యోతిర్లింగం ఉన్న సోమనాధ్ ఆలయం ఉన్న గుజరాత్ లో తాను జన్మించానని.. విశ్వనాధుడి భూమి వారణాసిలో సేవచేసే అవకాశం దక్కిందని అన్నారు. రెండో జ్యోతిర్లింగం శ్రీశైల మల్లిఖార్జున స్వామిదని.. ఇప్పుడు శ్రీశైలం వచ్చి మల్లిఖార్జున స్వామి వారి ఆశీర్వచనాలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని కూడా దర్శించానని ఛత్రపతి శివాజీ, అల్లమ్మ ప్రభు, అక్కమహాదేవి లాంటి శివభక్తులకు ప్రణామాలు తెలిపారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి లాంటి ధీరులకు నమస్కారం చేస్తున్నానని ప్రధాని అన్నారు. ఈ సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ, మంత్రి నారా లోకేష్ సహా పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జీఎస్టీ 2.0 సామాన్య ప్రజలకు ఊరటనిచ్చే సంస్కరణ



(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలసి ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సభకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ధర్మాన్ని పట్టుకుని ముందుకు వెళ్తున్న నరేంద్ర మోదీ లాంటి వ్యక్తి ప్రధానిగా ఉండడం మన అదృష్టం. మోదీ దేశాన్ని మాత్రమే కాదు.. రెండు తరాలను ముందుకు నడుపుతున్నారు. భావి తరానికి మార్గదర్శనం చేస్తున్నారు. దేశం తలెత్తుకొనేలా ఆత్మ నిర్భర్ భారత్ తీసుకువచ్చారు. మేము సేవకులం మాత్రమే కాదు అవసరం అయితే ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తామని చాటి చెప్పారు. భారత్ అగ్రగామి.. ఎవరికీ భయపడే దేశం కాదని చేతల ద్వారా తెలియ చెప్పారు.

**ప్రజల ఆకాంక్షలను ముందుకు తీసుకువెళ్తాము:** ఒక దేశపు జెండా ఎలా పౌరుషంగా ఉంటుందో.. అలాగే మన దేశాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టిన మోదీ ఈ రోజున మన రాష్ట్రానికి విచ్చేసి రూ. 13 వేల కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఒక్క ఓర్వకల్లు పారిశ్రామికవాడలోనే రూ. 4 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. పెట్టుబడులు రావాలి అంటే ప్రభుత్వాలపై నమ్మకం ఉండాలి. కూటమి ప్రభుత్వం కనీసం 15 ఏళ్ల పాటు అధికారంలో ఉండాలి. పెట్టుబడులు పరిశ్రమల నమ్మకాన్ని సడలించకుండా అంతా కలిసి ఉండి స్థిరమైన ప్రభుత్వాన్ని కొనసాగిస్తాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలను ముందుకు తీసుకువెళ్తామని తెలియజేస్తున్నాను" అన్నారు.

**మోదీకి సత్కారం**

అంతకు ముందు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సభ వేదికపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ సత్కరించారు. మహాశివుని ప్రతిమను బహూకరించారు.

## ఏపీలో పర్యటించడం ఎంతో ఆనందంగా ఉంది



(మొదటి పేజీ తరువాయి)

ఏపీ ప్రయాణం కర్నూలులోనే 72 ఏళ్ల క్రితం ప్రారంభమైందని గుర్తు చేశారు. అదే పవిత్ర భూమి నుంచి రాష్ట్ర అభివృద్ధి సాగుతోందన్నారు. ఇది కేవలం ప్రారంభోత్సవం కాదు దృఢ సంకల్ప ప్రకటన అన్నారు. ఒకేరోజు రూ. 13,430 కోట్ల ప్రాజెక్టులు దేశానికి అంకితమయ్యాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను సమూలంగా మార్చివేస్తాయన్నారు. ఈ మహత్తర మైలురాయి మోదీ అసాధారణ నాయకత్వం, సహకారానికి ఫలితం అన్నారు. ఏపీ ప్రజల పట్ల మోదీ వాగ్దానం మన భవిష్యత్తులో గొప్ప పెట్టుబడి అని తెలిపారు. మోదీ నిరంతర కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని వెల్లడించారు. మేము కూడా భుజం భుజం కలిపి నిరంతరం కృషి చేస్తామని ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ తెలిపారు.

కర్నూలు సభలో ఆసక్తికర ఘటన : కర్నూలు సభలో సూపర్ జీఎస్టీ పుస్తకావిష్కరణ సమయంలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. దూరంగా ఉన్న మంత్రి లోకేశ్‌ను తన పక్కకు పిలిచి సూపర్ జీఎస్టీ కార్యక్రమం డిజైనింగ్, నిర్వహణ అద్భుతంగా చేశావంటూ మోదీ కితాబు పలికారు. తనకు పుస్తక కాపీ అందజేసే సమయంలో పక్కన ఉండాలని లోకేశ్?ను మోదీ కోరారు. అనంతరం పుస్తక కాపీని లోకేశ్ చేతులమీదుగా ప్రధాని మోదీ అందుకున్నారు.

వైఎస్సార్సీపీ ఫేక్ ప్రచారంపై కేంద్ర ఇంటెలిజెన్స్ ఆరా : ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనను సైతం వైఎస్సార్సీపీ అసత్య ప్రచారానికి వాడుకోవడంపై కేంద్ర ఇంటెలిజెన్స్ ఆరా తీసినట్టు సమాచారం. ప్రధాని రాష్ట్ర పర్యటన సందర్భంగా కర్నూలు విమానాశ్రయం వద్ద స్వాగతం పలకడం, వీడ్కోలు పలికే సందర్భాల్లో ప్రొటోకాల్ ప్రకారం వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులకు రాష్ట్రప్రభుత్వం అవకాశం కల్పించింది. దీన్నిరాజకీయం చేసి వైఎస్సార్సీపీ విమర్శల పాలయ్యింది.

ప్రధాని మోదీకి వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులు ఎలాంటి వినతిపత్రం ఇవ్వకపోయినా మెడికల్ కాలేజీలు, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చాలని వినతి పత్రం ఇచ్చి ప్రధానిని కోరినట్టు అసత్య ప్రచారానికి ఆ పార్టీ అనుబంధ మీడియాల్లో అసత్య ప్రచారం చేశారు. ప్రధానికి ఆహ్వానం పలికిన సందర్భాన్ని సైతం ఫేక్ ప్రచారానికి వాడుకోవడాన్ని కేంద్ర వర్గాలు తప్పుబట్టినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రధాని రాష్ట్ర పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ ప్రకారం ప్రతిపక్ష పార్టీని వైఎస్సార్సీపీ ఆహ్వానించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం ఆ పార్టీ ప్రజా ప్రతినిధులను సైతం ఆహ్వానించి తగు గౌరవం ఇస్తోంది. ఇచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకోకుండా వైఎస్సార్సీపీ నేతలు అసత్య ప్రచారానికి తెరలేపడంపై కూటమి నేతలు మండిపడుతున్నారు.

## రూ. 200 కోట్లతో 4 స్టార్ దసపల్లా హొటల్..



(మొదటి పేజీ తరువాయి)

ఈ దసపల్లా హొటల్ నిర్మాణంతో 400 మంది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. పదేళ్ల పాటు రాష్ట్ర పన్నులు ,స్టాంప్ డ్యూటీ 100 శాతం తిరిగి చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. పరిశ్రమల తరహాలో విద్యుత్ చార్జీలు విధింపు ,5 ఏళ్లకు విద్యుత్ సుంకం తిరిగి చెల్లించాలని నిర్ణయం తీసుకోవడంతో పాటు టూరిజం పాలసీ 2024–29 ప్రకారం పలు రాయితీలు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## డబుల్ ఇంజన్ సర్కార్ ... రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా !

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రిగా.. ప్రధానిగా 25 ఏళ్ల ప్రజాసేవ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియచేశారు. అత్యంత అంకిత భావంతో దేశానికి సేవలు అందిస్తున్న మోదీ ఓ విశిష్టనేత అని కొనియాడారు. సరైన సమయంలో సరైన చోట సరైన నేతగా ప్రధాని స్థానంలో మోదీ ఉన్నారని.. ఆయన 21 వ శతాబ్దపు నేత అని సీఎం వ్యాఖ్యానించారు. ఎలాంటి విరామం లేకుండా ప్రజల సేవలోనే ఆయన అంకితమై ఉన్నారని.. తాను చూసిన ప్రధానుల్లో మోదీ అత్యంత ప్రగతిశీల నేత అని అన్నారు. దేశ అభివృద్ధి కోసం ఆయన కీలకమైన సంస్కరణలు తీసుకువచ్చారని తద్వారా ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రస్థానానికి చేరుకుంటోందని అన్నారు. 11 ఏళ్ల క్రితం 11వ స్థానంలో ఉన్న భారతదేశం ప్రధాని మోదీ సంకల్పంతో ఇప్పుడు 4వ స్థానానికి చేరిందని... వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా 2047కు దేశం సూపర్ పవర్ గా మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా సైనిక పరంగా భారతదేశ సత్తాను ప్రపంచానికి చాటేలా చేశారని ముఖ్యమంత్రి అన్నారు.

**జీఎస్టీ సంస్కరణలతో ప్రజలందరికీ లాభమే :** ఒకే దేశం – ఒకే పన్ను – ఒకే మార్కెట్ నినాదంతో వచ్చిన జీఎస్టీ పన్ను విధానంలో ప్రస్తుత సంస్కరణల వల్ల 99 శాతం వస్తువులు సున్నా నుంచి 5 శాతం పన్ను పరిధిలోకి వచ్చాయని.. తద్వారా అన్ని వస్తువుల ధరలు తగ్గాయని సీఎం అన్నారు. జీఎస్టీ 2.0తో పన్నులు తగ్గి పేదలు, మధ్యతరగతికి గణనీయంగా ఉపశమనం కలిగిందని అటు వ్యాపారులు, ఎంఎస్ఎంఈ వర్గాలకూ ప్రయోజనం చేకూరుతోందని స్పష్టం చేశారు. విద్యార్థులు, రైతులు, చిరుద్యోగులు, చిరు వ్యాపారులు, వృద్ధులు, కూలీలు, కార్మికులు ఇలా అన్ని వర్గాలకు లబ్ది కలిగించేలా సంస్కరణలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతీ కుటుంబానికీ రూ. 15 వేల వరకూ ఆదా అవుతుందని స్పష్టం చేశారు. దసరా నుంచి దీపావళి వరకూ జీఎస్టీ సంస్కరణల్ని పండుగలా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 98 వేల ఈవెంట్లు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. జీఎస్టీ బచత్ ఉత్సవ్ కాస్తా ఇవాళ భరోసా ఉత్సవ్ గా మారిందని చంద్రబాబు అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ తో రాష్ట్రానికి డబుల్ ప్రయోజనాలు కలుగుతున్నాయని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలు, సూపర్ జీఎస్టీతో ప్రజలకు సూపర్ గా పొదుపు జరిగిందని సీఎం అన్నారు.

**స్వదేశీ మంత్రమే బ్రహ్మాస్త్రం :** ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేస్తున్న టారిఫ్ లను ఎదుర్కొనేందుకు ప్రధాని మోదీ ఇచ్చిన స్వదేశీ పిలుపే తారకమంత్రం అవుతుందని సీఎం అన్నారు. ఈ స్వదేశీ పిలుపును అందిపుచ్చుకుని సెమీ కండక్టర్ల నుంచి శాటిలైట్ల వరకూ చిప్ ల నుంచి షిప్పుల వరకూ ఏపీలోనే ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టామని అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మెగా డీఎస్సీ, పీఎం కిసాన్–అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం–2.0, పెన్షన్ల పంపిణీ, వంటి సంక్షేమ పథకాలను కేంద్ర సహకారంతోనే సూపర్ హిట్ చేశామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి 16 నెలలుగా ప్రధాని మోదీ అందిస్తున్న సాయాన్ని మరువలేం అన్నారు. కేంద్రం సహకారంతో అమరావతిని నిలబెట్టామని, పోలవరాన్ని గాడిన పెట్టామని, విశాఖ ఉక్కును బలోపేతం చేశామన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అత్యధిక పెట్టుబడులు సాధిస్తోందని విశాఖలో ఆర్సెలార్ మిట్టల్, 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా హబ్ వస్తోందని, నెల్లూరులో భారత్ పెట్రోలియం కార్పోరేషన్ రిఫైనరీ వస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. రాయలసీమకు త్వరలో హైకోర్టు బెంచ్ రాబోతోందని సీఎం చెప్పారు. రాయలసీమలో స్టీల్, స్పేస్, డిఫెన్స్, ఏరో స్పేస్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్ తయారీ, గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, సిమెంట్ పరిశ్రమలు వస్తున్నాయన్నారు. వీటితో పాటు సెమీ కండక్టర్ యూనిట్, క్వాంటం వ్యాలీ రావడానికి కారణమైన ప్రధానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నట్టు సీఎం వ్యాఖ్యానించారు.

**ఏపీలో రూ.13,429 కోట్ల కేంద్ర ప్రాజెక్టులు :** రాష్ట్రంలో విద్యుత్, రైల్వే, జాతీయ రహదారులు, పారిశ్రామిక, రక్షణ రంగాలకు చెందిన రూ. 13,429 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. అలాగే ఇంకొన్నింటిని శంకుస్థాపనలు చేశారు. మరో రెండు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. రూ. 9,449 కోట్ల విలువైన 5 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ. 1704 కోట్ల విలువైన 8 అభివృద్ధి పనులను ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఇక రూ. 2276 కోట్ల విలువైన 2 ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేశారు. లిశంకుస్థాపనలు:లి విద్యుత్ ట్రాన్స్ మిషన్ వ్యవస్థ – రూ. 2886 కోట్లు, ఓర్వకల్లు–కొప్పర్తి పారిశ్రామిక కారిడార్ – రూ. 4922 కోట్లు, కొత్త వలస – విజయనగరం మధ్య 4వ లైన్ – రూ. 493 కోట్లు, పెందుర్తి – సింహాచలం నార్త్ మధ్య రైల్ ఫ్లైఓవర్ లైన్ – రూ. 184 కోట్లు, సబ్బవరం–షీలానగర్ జాతీయ రహదారి – రూ. 964 కోట్లు. లిప్రారంభోత్సవాలు:లి రేణిగుంట – కడప – మదనపల్లె రోడ్డు – రూ. 82 కోట్లు, కడప – నెల్లూరు – చునియంపల్లి రోడ్లు – రూ. 286 కోట్లు, కనిగిరి బైపాస్ రోడ్ – రూ. 70 కోట్లు, గుడివాడ–నూజెండ్ల వద్ద 4లేన్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జి – రూ. 98 కోట్లు, కల్యాణదుర్గం – రాయదుర్గం – మొలకలమూరు రోడ్డు – రూ. 13 కోట్లు, పీలేరు – కలసూర్ నాలుగు లేన్ల రోడ్ – రూ. 593 కోట్లు, నిమ్మకూరులోని BELలో అడ్వాన్స్‌డ్ నైట్ విజన్ గ్లాసుల ఉత్పత్తి కేంద్రం – రూ. 362 కోట్లు, చిత్తూరులోని ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్ – రూ. 200 కోట్లు. జాతికి అంకితం:

కొత్తవలస –కొరాపుట్ రైల్వే డబ్లింగ్ పనులు– రూ. 546 కోట్లు, శ్రీకాకుళం– అంగుల్ నాచురల్ గ్యాస్ పైప్‌లైన్ – రూ. 1730 కోట్లు.

**శ్రీశైల మల్లిఖార్జునుడ్ని దర్శించిన ప్రధాని, సీఎం :** కర్నూలు విమానాశ్రయం నుంచి శ్రీశైల క్షేత్రానికి హెలికాప్టర్ లో వెళ్లిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శ్రీశైల మల్లిఖార్జున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న శక్తిపీఠంలోని భ్రమరాంబ అమ్మవారిని దర్శించి.. వేదపండితుల ఆశీర్వచనాలను తీసుకున్నారు. శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రానికి వెళ్లిన ప్రధాని మోదీ సహా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెళ్లారు. స్ఫూర్తి కేంద్రంలోని దర్బార్ హాల్, ధ్యాన మందిరాన్ని ప్రధాని సందర్శించారు.

## రూ.13,429 కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని శ్రీకారం



(మొదటి పేజీ తరువాయి)

**శంకుస్థాపనలు:** విద్యుత్ ట్రాన్స్ మిషన్ వ్యవస్థ – రూ. 2886 కోట్లు, ఓర్వకల్లు–కొప్పర్తి పారిశ్రామిక కారిడార్ – రూ. 4922 కోట్లు,

కొత్త వలస – విజయనగరం మధ్య 4వ లైన్ – రూ. 493 కోట్లు, పెందుర్తి – సింహాచలం నార్త్ మధ్య రైల్ ఫ్లైఓవర్ లైన్ – రూ. 184 కోట్లు, సబ్బవరం–షీలానగర్ జాతీయ రహదారి – రూ. 964 కోట్లు.

**ప్రారంభోత్సవాలు:** రేణిగుంట – కడప – మదనపల్లె రోడ్డు – రూ. 82 కోట్లు., కడప – నెల్లూరు – చునియంపల్లి రోడ్లు – రూ. 286 కోట్లు., కనిగిరి బైపాస్ రోడ్ – రూ. 70 కోట్లు, గుడివాడ–నూజెండ్ల వద్ద 4లేన్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జి – రూ. 98 కోట్లు, కల్యాణదుర్గం – రాయదుర్గం – మొలకలమూరు రోడ్డు – రూ. 13 కోట్లు, పీలేరు – కలసూర్ నాలుగు లేన్ల రోడ్ – రూ. 593 కోట్లు , నిమ్మకూరులోని BELలో అడ్వాన్స్‌డ్ నైట్ విజన్ గ్లాసుల ఉత్పత్తి కేంద్రం – రూ. 362 కోట్లు, చిత్తూరులోని ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్ – రూ. 200 కోట్లు.

**జాతికి అంకితం:** కొత్తవలస –కొరాపుట్ రైల్వే డబ్లింగ్ పనులు– రూ. 546 కోట్లు, శ్రీకాకుళం– అంగుల్ నాచురల్ గ్యాస్ పైప్‌లైన్ – రూ. 1730 కోట్లు.

## అంతర్జాతీయ పోస్టల్ సేవలు పునరుద్ధరణ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** అమెరికాలో నివసించే భారతీయులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. ఆ దేశానికి అంతర్జాతీయ పోస్టల్ సేవలను పునరుద్ధరించింది. నేటి నుండి అన్ని రకాల పోస్టల్ సేవలు పునః ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. డెలివర్డ్ డ్యూటీ పెయిడ్ కస్టమర్లపై ఎటువంటి అదనపు ఛార్జీలు విధించబోమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ ధృవీకరించింది. పోస్టల్ టారిఫ్‌లు మారకుండా ఉంటాయని తెలిపింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్ నిబంధనల కారణంగా ఆ దేశానికి పోస్టల్ సర్వీసులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఆగస్టు 25వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్ యాక్ట్ టారిఫ్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం వాటి విలువతో సంబంధం లేకుండా అంతర్జాతీయ పోస్టల్ వస్తువులన్నింటిపైనా అమెరికా కస్టమ్స్ సుంకాలు విధించింది అమెరికా. 100 డాలర్ల వరకు విలువైన బహుమతులపై మాత్రం టారిఫ్ మినహాయింపు ఉంది.

**"ఆ విషయంపై భారత్ ను హెచ్చరించా..: వినకపోతే ఏం జరుగుతుందో వాళ్లకు తెలుసు"**

డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం– అంతర్జాతీయ పోస్టల్ నెట్‌వర్క్ ద్వారా రవాణా చేసే క్యారియర్‌లు లేదా అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ద్వారా ఆమోదం పొందిన థర్డ్ పార్టీ సంస్థలు.. పోస్టల్ సరుకులపై టారిఫ్ ను వసూలు చేసి, అక్కడి ప్రభుత్వానికి చెల్లించాలి. అధికారిక గుర్తింపు పొందిన థర్డ్ పార్టీలు, టారిఫ్ వసూళ్లు, చెల్లింపు విధానాలకు సంబంధించిన అంశాలు స్పష్టంగా లేవు.

దీని ఫలితంగా– అమెరికాకు వెళ్లే ఎయిర్ క్యారియర్లు ఏవీ కూడా ఈ నెల 25వ తేదీ నుంచే పోస్టల్ పార్సిళ్లను స్వీకరించలేమని ప్రకటించాయి. ఆయా కారణాల వల్ల.. పోస్టల్ శాఖ ఈ నెల 25వ తేదీ నుండి అమెరికాకు వెళ్లే అన్ని రకాల పోస్టల్ ఆర్టికల్స్ బుకింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించింది. ఉత్తరాలు/డాక్యుమెంట్లు, 100 అమెరికన్ డాలర్ల వరకు విలువైన బహుమతులకు ఈ నిలిపివేత వర్తించదు. వీటికి మినహాయింపు ఉంది.

తాజాగా అమెరికాకు పోస్టల్ సర్వీసులను పునరుద్ధరించింది కేంద్ర ప్రభుత్వం. ఇప్పుడు అన్ని రకాల అంతర్జాతీయ మెయిల్, ఎక్స్ ప్రెస్ మెయిల్స్, ఎయిర్ పార్సిల్స్, రిజిస్టర్డ్ లెటర్స్/ప్యాకెట్స్, ట్రాక్డ్ ప్యాకెట్స్ ను అమెరికాకు బుక్ చేసుకోవచ్చు. పోస్టాఫీసులు, ఇంటర్నేషనల్ బిజినెస్ సెంటర్, డాక్ ఘర్ నిర్యాత్ కేంద్ర లేదా ప్రకటించిన మెయిల్.లోని సెల్ఫ్–సర్వీస్ పోర్టల్ ద్వారా అమెరికాకు తమ పార్సిళ్లను పంపించవచ్చు.

# ఏపి నెం.1 కావడం గ్యారంటీ

(మొదటి పేజీ తరువాయి)

పేదరికం లేని దేశమే మన నమో కల. జీఎస్టీ తగ్గించాలని ప్రధాని నిర్ణయం తీసుకున్న తరువాత మన ఫైనాన్స్ మంత్రి కేశవ్ వచ్చి దాదాపు 8 వేల కోట్లు నష్టపోతామని ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా పర్వాలేదు... పేద ప్రజలకు 8 వేల కోట్ల లాభం జరుగుతుంది కదా అని సిఎం అన్నారు. నమో ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్రజల మంచి కోసమే, దానికి చంద్రబాబు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు.

కేంద్రం లో మన నమో ... రాష్ట్రంలో మన సిబిఎన్. ఇది డబుల్ ఇంజిన్ సర్కార్ కాదు డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్. ప్రధాని సహాయంతో విశాఖ ఉక్కు ను కాపాడుకున్నాం. విశాఖ లో రైల్వే జోన్ ఏర్పాటు చేసుకున్నాం. పోలవరం పనులు వేగవంతం అయ్యాయి. అమరావతి పనులు వేగంగా జరగడానికి, కర్నూలు లో హై కోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరిస్తున్నారు. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాష్ట్రం లో ఏర్పాటు చెయ్యమని కంపెనీ వాళ్లను కోరినప్పుడు వాళ్లు మాకు మూడు అంశాల్లో క్లారిటీ కావాలని అడిగారు. వెంటనే మన ముఖ్యమంత్రి ప్రధానిని కలిసి చెప్పిన వెంటనే ఆయన దానికి అంగీకరించారు. నమో సహకారం వల్లే భారత్ లో అతి పెద్ద స్టీల్ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్ కు వచ్చింది. గూగుల్, స్పేస్ సిటీ , డ్రోన్ సిటీ, కొప్పర్తి, ఓర్వకల్ ఇండస్ట్రియల్ నోడ్, బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోంది. దట్ ఈజ్ ద పవర్ ఆఫ్ డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కార్.

నమో అంటే విక్టరీ. ఆయన ఏ కార్యక్రమం ప్రారంభించినా విజయమే. గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత దేశానికి ప్రధానిగా నమో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్నారు. కష్టపడి పనిచేయడానికి ప్రత్యామ్నాయం లేదు. 25 ఏళ్లు అధికారంలో ఉన్నా మన నమో మొదటి రోజు ఎంత కష్టపడ్డారో ఇప్పటికీ అంతే హార్డ్ వర్క్ చేస్తూనే ఉన్నారు. గుజరాత్ ను పవర్ ఫుల్ స్టేట్ గా మార్చారు. ఇప్పుడు భారత దేశాన్ని సూపర్ పవర్ గా మారుస్తున్నారు. గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు. మన దేశ ప్రభుత్వాలు యూఎన్ దగ్గరకో, ఇతర దేశాల దగ్గరకో వెళ్లి సాయం కోరేవారు. మన నమో రూటే సెపరేటు. పెహల్గావ్ లో నమో కొట్టిన దెబ్బకి పాకిస్థాన్ దిమ్మ తిరిగిపోయింది. అమెరికా ట్యాక్సులు పెంచితే పెద్ద పెద్ద దేశాలు కూడా వణికిపోయాయి. నమో ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. నమోకి దేశ ప్రజలు అంటే నమ్మకం.. మనకి నమో అంటే నమ్మకం. ఆ నమ్మకమే దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.



## పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన వైస్సార్సీపీ నాయకులు

**చిత్తూరు, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

తిరుపతి లోని వైస్సార్సీపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ని బుధవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రియా శీలక కార్యదర్శి రాకేష్ కిరణ్, జిల్లా వాణిజ్య సంయుక్త కార్యదర్శి అన్నదొరై మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. జిల్లా లోని పలు సమస్యలు గురించి వారితో చర్చించడం జరిగింది.సత్యవేడు నియోజకవర్గం లోని పలు సమస్యలు గురించి వారితో చర్చించడం జరిగింది. మండలాలల్లో సమస్యలు ఎక్కవగా ఉన్నాయని పేద ప్రజలకు అన్యాయం జరిగితుందని, ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు గాలికి వదిలేసి వారికీ కావాల్సిన వారికే పనులు చేస్తున్నారని అన్నారు.

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలు

- విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి రేపిన ప్రాజెక్టులు



**సూళ్లూరుపేట, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి, ప్రజ్ఞావంత శాస్త్రవేత్త డాక్టర్ ఏ.పి.జే. అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించే ఉద్దేశ్యంతో పాఠశాల విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రదర్శించిన ప్రాజెక్టులలో నాలుగు ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి, అవార్డులు, ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమం ఆరంభంలో ప్రతిభావంతులైన చిన్నారులు అబ్దుల్ కలాం విగ్రహానికి పుష్పమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనతరం ప్రధాన అతిథులు తమ ప్రసంగాలలో కలాం గారి సేవలు, ఆలోచనలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇస్రో మాజీ ఉద్యోగి, పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్. శ్రీనివాసులు మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఇస్రోలో చేసిన కృషి, ఆయన జీవిత స్ఫూర్తి ప్రతి విద్యార్థికి ఆదర్శమని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం జాయింట్ సెక్రటరీ ఉస్మాన్ భాష మాట్లాడుతూ "మిస్సైల్ మాన్‌గా కలాం చేసిన సేవలు దేశాన్ని ప్రపంచంలో గౌరవ స్థితికి చేర్చాయి" అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు కుమార్ రెడ్డి, హైస్కూల్ హెడ్ మాస్టర్ శ్రీనివాసులు రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ



**ఏర్పేడు, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు పిసిసి అధ్యక్షురాలు వై యస్ షర్మిలారెడ్డి మరియు డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు ఆదేశాల మేరకు ఓట్ చోర్ గద్దిచోడ్ కార్యక్రమం చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలం, పల్లంపేట గ్రామం నందు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రాను రాను ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని ఓట్ చోర్ గద్దిచోడ్ కార్యక్రమానికి ప్రజల్లో విశేషమైనటువంటి స్పందన లభిస్తుందని రానున్న రోజులు కాంగ్రెస్ పార్టీవేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు జనార్ధన రెడ్డి, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోని, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు నవీన్, చరణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి

- ఘననివాళులు అర్పించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రెడ్డిగూడెం మండల అధ్యక్షులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి



**రెడ్డిగూడెం, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

భారతదేశాన్ని అంతరిక్ష రంగంలో అగ్రగామిగా నిలిపిన గొప్ప శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా. ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలు స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రెడ్డిగూడెం మండల అధ్యక్షులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి మరియు, మైలవరం నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు ఉయ్యూరు సత్యనారాయణ రెడ్డి , జిల్లా కార్యదర్శి, రెడ్డిగూడెం మండల వైస్ ఎంపీపీ చాట్ల రావట్ , జిల్లా కార్యదర్శి కుప్పిరెడ్డి వరప్రసాద్ రెడ్డి , యువ నాయకుడు గుంటక కులదీప్ రెడ్డి , పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ అలవాల శ్రీనివాసరెడ్డి , బత్తుల వీరబాబు, మైనార్టీ నాయకులు షేక్ ఏసుబాబు తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# స్వచ్ఛమైన గాలికి సమష్టిగా కృషిచేద్దాం

- ఈ నెల 18న క్లీన్ ఎయిర్ థీమ్‌తో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర
- పర్యావరణహిత దీపావళి పండగను జరుపుకుందాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

ఈ నెల 18వ తేదీన స్వచ్ఛమైన గాలి (క్లీన్ ఎయిర్) ఇతివృత్తంతో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల విజయవంతానికి ప్రణాళికాయుత కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. జిల్లా, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వ హణ పై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుసంపన్నమైన, ఆరోగ్యవం తమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర ఏ 2047 దార్శనిక పత్రంలోని పది సూత్రాల్లో సమగ్ర విధానాలతో స్వచ్ఛాం ధ్ర అనేది ఒక సూత్రంగా ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి నెలా మూడో శనివారం ఒక ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిసు న్నట్లు తెలిపారు. ఈ నెల మూడో శనివారం క్లీన్ ఎయిర్ థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గాలి కాలుష్య కారకాలకు అడ్డుకట్ట వేస్తూ హరిత విస్తీర్ణం పెంచడం ద్వారా స్వచ్ఛమైన గాలిని ఐశ్వర్యంగా పొందొచ్చన్నారు. గాలి కాలుష్యం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిం చాలన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ, సౌర విద్యుత్ విని యోగం వంటి వాటిని ప్రోత్సహించాలన్నారు. నిత్య జీవిత ప్రయాణాన్ని పర్యావరణహిత మార్గంలో సాగిం చేలా అవగాహన కల్పించాలని.. హానికర టపాసులు కాకుండా దీపాల కాంతులతో పర్యావరణహిత దీపావళిని జరుపుకుం దామని.. అధికారులు, సిబ్బంది కూడా ఇదే బాటలో నడిచి భావితరాలకు స్వచ్ఛమైన గాలి రూపంలో వెలకట్ట లేని సంపదను బహుమతిగా అందిం చడంలో భాగస్వాముల మవుదామని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో డీపీవో పి.లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి శ్రామికుల ఈ కేవైసీ 100% పూర్తి చేయాలి

- ఈకేవైసీ పురోగతి సరిగా లేని మండలాలపై డి ఎల్ డి వో లు దృష్టి సారించాలి
- జిల్లాలోని గ్రామ పంచాయతీల భవనాలన్నింటికీ సౌర విద్యుత్ ఏర్పాటు చేయాలి
- గ్రామాల్లో చెత్త సేకరణ విధానం మెరుగవ్వాలి
- వసతి గృహాలను ప్రత్యేక అధికారులు నిరంతరం తనిఖీ చేయాలి
- ఉపాధి హామీ పథకం, ఐవిఆర్ఎస్ నివేదిక, సంక్షేమ వసతి గృహాలపై సమీక్షలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



**విజయవాడ, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

ఈవారం చివరిలోగా ఉపాధి కూలీలందరికీ ఈకేవైసీ పూర్తిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్, ఐవిఆర్ఎస్ నివేదిక, వసతి గృహాలపై డి ఎల్ డి వో లు, ఎంపీడీవోలు, వసతి గృహాల ప్రత్యేక అధికారులతో బుధవారం దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... నవంబర్ నుంచి ఉపాధి హామీ పనులకు బయోమెట్రిక్ విధానం తప్పనిసరి అని, అందువల్ల ఉపాధి శ్రామికులందరికీ ఈకేవైసీ పూర్తిచేయాలని చెప్పారు. 100% ఈ కేవైసీ జరగకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. టెండర్లతో సంబంధం లేకుండా పశువుల షెడ్లను స్వయంగా నిర్మించుకోవచ్చని, అయితే బిల్లు విలువ 50వేలకు మించరాదని చెప్పారు. స్వయంగా నిర్మించుకోలేని వారికి టెండర్ల ద్వారా వెండర్ ను ఎంపిక చేయాలని చెప్పారు. గ్రామపంచాయతీలో చెత్త సేకరణపై ప్రజల నుంచి పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం కావడం లేదని, దీనికి గల కారణాలను అన్వేషించాలని చెప్పారు. జిల్లాలో ముక్తేశ్వరపురం, సుబ్బయ్య గూడెం, పాతపాడు, రాయనపాడు, పొందుగల గ్రామపంచాయతీలు చెత్త సేకరణలో టాప్ ఫైవ్ లో ఉన్నాయని అభినందించారు. మిగిలిన గ్రామాలలో కూడా చెత్త సేకరణ సక్రమంగా జరగాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామపంచాయతీల భవనాలన్నింటికీ సౌర విద్యుత్ ఏర్పాటు చేయాలని చెప్పారు. సంక్షేమ వసతి గృహాలను నిరంతరం పర్యవే క్షించాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఆహార నాణ్యత, మంచినీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణ, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించాలని, దీనికై ప్రత్యేక అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని చెప్పారు. నీటి నాణ్యత నిర్ధారించడానికి ప్రతి సంక్షేమ వసతి గృహానికి క్లోరిన్ కిట్లను ఇస్తామని తెలిపారు. క్లోరి న్ విలువ 0.5నుంచి 2 పిపియం మధ్యన ఉండాలని, 0.5 కంటే తక్కువ ఉన్న నీటిని త్రాగడానికి వినియో గించరాదని చెప్పారు. హాస్టల్ వార్డెన్లు నీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించి ఆ వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఏ.రాము, డిపిఓ లావణ్య కుమారి, డి ఎల్ డివోలు పి.శ్రీనివాసరావు, పార్థసారథి, డివిజనల్ పంచాయితీ అధికారి జి.రాఘవన్ పాల్గొన్నారు.

# గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌లో రోజూ లక్కీడ్రా

- కొనుగోలుదారులకు ఆకర్షణీయ బహుమతుల బొనాంజా
- చివరిరోజు బంపర్ డ్రాలో విజేతకు స్కూటీ బహుమతి
- సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ఉత్సవాలను సద్వినియోగం చేసుకోండి
- ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ



**విజయవాడ, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

ఈ నెల 13న నగరంలోని పున్నమిఘాట్‌లో ప్రారంభమైన గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌లో ప్రతిరోజూ లక్కీడ్రా నిర్వహిస్తున్నామని.. కొనుగోలుదారులు ఆకర్షణీయమైన బహుమతులు సొంతం చేసుకుంటున్నారని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి మార్గనిర్దేశనంతో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షాపింగ్ ఫెస్టివల్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, స్థానిక హస్తకళాకారుల ఉత్పత్తులు వంటి స్టాళ్లు ఉన్నాయని.. ప్రజలు ఈ ఫెస్ట్‌ను సందర్శించి వినోదంతో పాటు ప్రత్యేక ఆఫర్లు, జీఎస్టీ సేవింగ్స్‌తో షాపింగ్ చేసుకోవచ్చని పేర్కొ న్నారు. ప్రతి కొనుగోలుపై కూపన్లు అందించి ప్రతిరోజూ లక్కీడ్రా తీసి విజేతలను ఎంపిక చేసి ఆకర్షణీయ బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఫెస్టివల్ చివరిరోజు బంపర్‌డ్రా నిర్వహించి విజేతకు స్కూటీ బహుకరించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్న గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ ద్వారా ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు తగ్గిన జీఎస్టీ రేట్లతో, ప్రత్యేక రాయితీలతో వ్యాపార, వాణిజ్య సంస్థలు అందిస్తున్నాయని.. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు లక్కీడ్రా వంటి మనోరంజక కార్యక్రమాల ద్వారా సందర్శకులు, కొనుగోలుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోందని.. ఫెస్ట్‌ను విజయవంతంగా ముందుకుతీసుకెళ్తున్న స్టాళ్ల యజమానులకు, సందర్శకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు జేసీ ఇలక్కియ పేర్కొన్నారు.

# గాంధీ శిల్ప బజార్‌కు విశేష స్పందన





- దేశవ్యాప్త హస్తకళా ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రదర్శన, అమ్మకాలు మరో నాలుగు రోజులే
- ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలి: లేపాక్షి వీసీ, ఎండీ ఎం.విశ్వ

**విజయవాడ, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

దేశ సాంస్కృతిక వైభవానికి చిహ్నాలైన చేనేత, హస్తకళా ఉత్పత్తుల విశిష్ట సంపదను భావితరాలకు అందించాలనే ప్రయత్నంలో భాగంగా నగరంలో ఈ నెల 10న ప్రారంభించిన గాంధీ శిల్ప బజార్‌కు విశేష స్పందన లభిస్తోందని.. దేశవ్యాప్త హస్తకళా ఉత్పత్తులు ఒకే వేదికపై అందుబాటులో ఉన్న శిల్ప బజార్ ఈ నెల 19వ తేదీ వరకు మరో నాలుగు రోజులే అందుబాటులో ఉంటుందని, ఔత్సా హికులు సందర్శించి కళాకారులను ప్రోత్సహించాలని లేపాక్షి వీసీ, ఎండీ ఎం. విశ్వ బుధవారం తెలిపారు. విజయవాడ పటమట ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలోని మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో అఖిల భారత హస్తకళా వస్తువులు, కళాత్మక వస్త్ర ప్రదర్శన, అమ్మకం వేదిక గాంధీ శిల్ప బజార్‌లో దేశ వ్యాప్తంగా హస్తక ళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ఒకే వేదికపై తీసుకువచ్చి ప్రదర్శించడంతో పాటు అమ్మకాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కమిషనర్ సహకారంతో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప బజార్‌లో మంగళగిరి, పోచంపల్లి, వెంకట గిరి, గద్వాల్, సిద్దిపేట్, నారాయ ణపేట్, చీరాల, కలంకారి, బాటిక్ ప్రింటింగ్, బెంగాలి కాటన్, కాశ్మీరి సిల్క్, కోసా సిల్క్, మధురై, లక్నో చికన్ వర్క్, నారాయ ణవరం, గాగ్రా చోళి, కాటన్ ప్రిం టెడ్, సంబల్పూర్, కోసా (టస్సర్), ఆప్లిక్ వర్క్, ప్యాచ్ వర్క్, ఖాదీ మెటీరి యల్, బెడ్ షీట్స్ వంటివి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు గాంధీ శిల్ప బజార్ అందు బాటులో ఉంటుందని, రూ. కోటి విలువైన అమ్మకాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ. 40 లక్షల విలువైన వస్తువులను ఔత్సాహికులు కొనుగోలు చేసినట్లు లేపాక్షి వీసీ, ఎండీ ఎం.విశ్వ వెల్లడించారు.

## గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగులకు సమస్యలు పరిష్కరించండి

### రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ



**మైలవరం, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగులు వివిధ రకాల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానీ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ అన్నారు. గురువారం ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ప్రతినిధులతో జరిపే చర్చల్లో దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలని జేఏసీ నాయకులను కోరుకుం టున్నాము. సమాజంలో దివ్యాంగుల దివ్యాంగ ఉద్యోగుల స్థితిగతులను, వారి దీన పరిస్థితి అర్థం చేసుకొని వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని దివ్యాంగ ఉద్యోగుల సంఘం తరపున విజ్ఞప్తి చేస్తున్నాము. అదేవిధంగా గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగులకు క్షేత్రస్థాయి ( ఫీల్డ్) విధులు, ఆధార్ సెంటర్స్, బిఎల్ఓ డ్యూటీస్, ఇన్చార్జి డ్యూటీ (అదనపు విధులు) నుండి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని,ప్రభుత్వ కార్యాలయాలలో దివ్యాంగ ఉద్యోగులకు, దివ్యాంగులకు అవసరమైన మౌలిక వసతులు( గ్రౌండ్ ఫ్లోర్ టాయిలెట్స్, ర్యాప్స్ ) కల్పించాలని, సచివాలయ ఉద్యోగుల హేతు భద్దీకరణ ప్రక్రియలో దివ్యాంగ ఉద్యోగులను మిగులు ఉద్యోగులుగా చూపించి వారి మాతృ శాఖలో విలీనం చేసి ప్రభుత్వ కార్యాలయంలోనే వారీ అంగవైకల్యానికి తగ్గట్టు అనుకూలమైన సిట్టింగ్ పోస్టులు కేటాయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మరియు దివ్యాంగుల చట్టం 2016 అనుసరించి దివ్యాంగుల కు దివ్యాంగ ఉద్యోగులకు చట్టపరంగా సమాజంలో వివక్షకు తావు లేకుండా దివ్యాంగులకు సమాజంలో సమాన హెూదా సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మరియు న్యాయస్థానాలు కల్పించినటువంటి హక్కులు క్షేత్రస్థాయిలో(అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో) అమలు అయ్యే విధంగా చూడాలని ,ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన దివ్యాంగ ఉద్యోగులకు నాలుగు శాతం రిజర్వేషన్లతో సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము. వివిధ రూపాలలో ఉన్నత అధికారులకు ప్రజాప్రతినిధులకు దివ్యాంగ ఉద్యోగుల సమస్యల మీద అనేకసార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది వాటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ తెలియజేసారు.

## అక్టోబర్ 18 వ తేదీ నుండి చెకుముకి సైన్స్ సంబరాలు

**గన్నవరం, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**




విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని వెలిగితీయడానికి మరియు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడానికి చెకుముకి సంబరాలు తోడ్పడతాయని చెకుముకి జిల్లా కన్వీనర్ మరియు జన విజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు షేక్ ఇమామ్ తెలియజేశారు. ఈనెల 18వ తేదీన పాఠశాల స్థాయిలోనూ, నవంబర్ 1వ తేదీన మండలస్థాయిలోనూ, నవంబర్ 23వ తేదీన జిల్లాస్థాయిలోను మరియు డిసెంబర్ 12, 13, 14 తేదీలలో రాష్ట్ర స్థాయిలో ఈ సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.. ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలో చదివే 8, 9 మరియు 10వ తరగతి విద్యార్థులు ఈ సైన్స్ సంబరాల్లో పాల్గొనడానికి అర్హులు.. గన్నవరం మరియు ఉంగుటూరు మండలాల్లోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు అందరూ ఈ సైన్స్ సంబరా లలో పాల్గొనాలని , మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందరూ కూడా తమ తమ పాఠశాలలో ఈ చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించుటలో సహాయ పడాలని షేక్ ఇమామ్ కోరారు. ఇతర వివరాల కోసం 7799985786 నెంబర్కు సంప్రదించగలరు.

## ఘనంగా 8వ రాష్ట్రీయ పోషణమునోత్సవాలు



**మైలవరం, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

మైలవరం మండలంలోని పుల్లూరు సెక్టార్ లక్ష్మీ నరసాపురం గ్రామంలో 8వ రాష్ట్రీయ పోషణమునోత్సవాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది, మందుగా కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీలక్ష్మి గర్భిణీలు, బాలింతలుకు పోషకాహారం యొక్క ప్రాముఖ్యతని వివరించారు. స్కూల్ హెడ్మాస్టర్ వరలక్ష్మి కొన్ని ఆహారపు నియమాల గురించి వివరించారు . విజయవాహిని చారిటబుల్ పాండేషన్ అసోసియేట్ సిహెచ్ దివ్య గర్భవతులు బాలింతలు తీసుకువచ్చిన పోషక గురించి వివరించారు. కే. శిరీష 1000 రోజుల సంరక్షణ గురించి వివరించారు. అనతరం వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. అంగన్వాడి టీచర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

### 1100 గ్రాముల గంజాయి స్వాధీనం.... 9 మంది అరెస్ట్



**జి.కొండూరు, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

గంజాయి తరలిస్తున్న 9మంది నిందితులను జి కొండూరు మండలం వెంకటాపురం గ్రామం సమీపంలోని వాహిని కాలేజ్ రోడ్డు వద్ద అదుపులో తీసుకొని వారి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు రెండు స్కూటీలు మరియు ఒక ఆటోను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు . జి కొండూరు ఎస్సై సతీష్ తెలిపారు.

# పంచాయతీ పరిపాలన వ్యవస్థలో సంస్కరణలు చేపట్టిన ఉప ముఖ్యమంత్రి కృతజ్ఞతలు

- పునర్వ్యవస్థీకరణతో మెరుగైన సేవలు అందించగలం
- 10వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తేజాన్నిచ్చారు



**మంగళగిరి, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి నాలుగు గ్రేడులుగా పంచాయతీలను వర్గీకరించడం శుభ పరిణామమని ఏపీ పంచాయతీ సెక్రెటరీస్ అసోసియేషన్ తెలిపింది. బుధవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో అసోసియేషన్ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తో సమావేశమయ్యారు. పంచాయతీ పరిపాలన వ్యవస్థలో పునర్వ్యవస్థీకరణ చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "గ్రామాల్లో చక్కటి మౌలిక సదు పాయాలు కల్పించాలి. నాలుగు గ్రేడుల పంచాయతీల విధానం కచ్చితంగా గ్రామీణ ప్రజలకు మేలు చేస్తుంది. రూర్బన్ పంచాయతీలు గుర్తించినవాటిలో పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తాము. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. స్థానిక సంస్థల పాలనలో పారదర్శకత తీసుకువచ్చేలా సంస్కరణలు తీసుకువచ్చాము. వీటిని క్షేత్ర స్థాయిలో అమలు చేయడంలో సిబ్బంది పాత్ర కీలకం" అన్నారు. పంచాయతీలను నాలుగు గ్రేడులుగా వర్గీకరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే వెసులు బాటు కలుగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పన చేపట్టడంతో అందరూ సంతోషంగా ఉన్నామని, మరింత ఉత్తేజంతో విధులు చేపడతామని వివరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ విజ్ఞప్తి చేసిన పలు అంశాలపై ఉప ముఖ్యమంత్రివర్యులు స్పందించి.. వాటిపైపరిశీలన చేసి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

# అగ్రికల్చర్ మార్కెటింగ్ అధికారులు చేతివాటాం

**విజయవాడ, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**





రైతులు పండించిన పంటకు కు గిట్టుబాటు ధర రావాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు బజార్లు ఇపుడు అవినీతికి నిలయంగా మారాయి. కంచె చేను మెసే చందంగా అగ్రికల్చర్ మార్కెటింగ్ అధికారులే చేతివాటాం ప్రదర్శిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా రైతు బజార్లు ఇతర జిల్లాల నుండి కుళ్ళిన టమాటాలు ను తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలు కు అమ్మకాలు సాగిస్తు న్నారు. గ్రేడ్ 3 టమాటా ఎక్కువ శాతం టమాటా సాస్ కోసం జ్యుస్ ఫ్యాక్టరీ వాళ్ళు కొనుగోలు చేస్తారు. అలాంటి గ్రేడ్ 3 టమాటా ని ఎన్టీఆర్ జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ అధికారులు తక్కువ ధర కి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు రైతు బజార్లు అమ్ముతున్నారు. కర్నూలు జిల్లా ప్రత్తికొండ నుండి కొనుగోలు చేసిన కుళ్ళి న టమాటాలు కేజీ 6 రూపాయలు కొనుగోలు చేసి పది ఇరవై పైసలు కు కొనుగోలు చేసినట్టు రికార్డ్ఉఉల్యా కానీ రైతు బజార్ లో మాత్రం కిలో టమాటాలు 18 కి వినియోగదారు కి అమ్ముతున్నారు. కేజీ టమాటా 6 రూపాయలు,లారీ కిరాయి మరియు లోడింగ్, అం లోడింగ్ కలిపి 4 రూపాయిలు, అంటే మొత్తం మీద టమాటా 10 రూపాయిలుకి కొనుగోలు చేసినట్టు బిల్లు లో ఉన్నాయి. మరి రైతు బజార్లు లో గ్రేడ్ 3 టమాటా కేజీ 18 రూపాయిలు కు వినియోగదారుల కుఎక్కువ ధరకు ఎలా అమ్ముతున్నారు. మరి 8 రూపాయిలు ఏ అధికారి జేబులో కి వెళ్లాయి. ఇతర జిల్లాల్లో ఏ రైతులు వద్ద టమాటా కొనుగోలు చేశారు.ఏ రైతు అకౌంట్ లో డబ్బులు బదిలీ చేశారు.దీనిపై జిల్లా కలెక్టర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ అధికారులు విచారణ జరిపితే అవినీతి బాగోతం బయట పడుతుంది. మార్కెటింగ్ అధికారులు జేబులు నింపుకోవడానికి కుళ్ళిన టమాటాలు రైతు బజార్లు అమ్మి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం అడుతున్నారు. ఈ కుళ్ళిన టమాటాలు ను అగ్రికల్చర్ మార్కెటింగ్ అధికారులు ఇళ్ళల్లో వినియోగించు కుంటారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



## పొట్టి శ్రీరాములు విగ్రహ నమూనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

రాజధాని అమరావతిలో 58 అడుగుల ఎత్తులో నిర్మించనున్న అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహ నమూనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన ఈ నమూనాలను సీఎం పరిశీలించారు. రాజధాని ప్రాంతంలోని శాఖమూరులో 6.8 ఎకరాల్లో ప్రభుత్వం పొట్టిశ్రీరాములు స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ స్మృతి వనానికి గత నెల 3వ తేదీన మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. వచ్చే ఏడాది మార్చి 16న పొట్టి శ్రీరాములు 125వ జయంతి నాటికి ఈ స్మృతివనంలో 58 అడుగుల విగ్రహాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో విగ్రహ డిజైన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా విగ్రహానికి స్టాచ్యూ ఆఫ్ సాక్రిఫైస్ గా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి కృష్ణాజిల్లా సబ్ జూనియర్ ఫెన్సింగ్ జట్ల ఎంపికలు



**కృష్ణాజిల్లా స్పోర్ట్స్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**

వీర్లపాడు మండలం పొన్నవరంలోని ఏకత్వ పాఠశాలలో అండర్ 14 బాల, బాలికల జిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కృష్ణాజిల్లా ఫెన్సింగ్ సంఘ కార్యదర్శి నాగం సతీష్ బాబు మంగళవారం తెలిపారు. ఈ పోటీలకు 01/01/2012 తరువాత జన్మించిన క్రీడాకారులు (ఫెన్సర్స్), ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి గుర్తింపు కార్డును కలిగి, వ్యక్తిగత ఫెన్సింగ్ క్రీడా పరికరాలతో ఎంపికలకు హాజరుకావాలని సతీష్ బాబు కోరారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 18వ తేదీలో కాకినాడలోని లక్ష్య పాఠశాల నందు జరగబోయే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్ 14 బాల బాలికల ఫెన్సింగ్ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

# విద్యార్థిని , విద్యార్థులు అబ్దుల్ కలామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

**మైలవరం, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్)**




స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ మరియు కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త, ప్రపంచ మేధావి డా.ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ 94వ జయంతి వేడుకలు గురువారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగం వారు ఇన్నోవేషన్ డే అనే కార్యక్రమాన్ని నిర్వహించి బెస్ట్ రీసెర్చ ర్ అవార్డులు 11 మంది అధ్యాపకులకు కి , నలుగురు అధ్యాపకులకు సర్టిఫికేషన్ ఆఫ్ అప్రీసియేషన్ అవార్డులు మరియు స్కాలర్ అచీవ్మెంట్ అవార్డు ( స్టాండ్ ఫోర్డ్ యూనివర్సిటీ టాప్ 2% సైంటిస్ట్ 2024 ) డా.వి. ధనరాజ్ కి ప్రెసిడెంట్ మరియు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం రాష్ట్రపతి అయిన అతి సాధారణ పౌరుడు గా మెలిగాడని ప్రపంచ దేశాల మన్ననలు పొందాడని, ఆయన కృషి వల్ల ప్రపంచ దేశాల్లో భారత దేశానికి ఖ్యాతి చేకూరిందని, ప్రతి ఒక్కరు కలాం ను స్ఫూర్తిగా తీసుకొని జ్ఞాన సంపన్నులుగా వెలగాలని తాము ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, కలామ్ గొప్ప శక్తి అని ప్రపంచానికి భగవంతుడిచ్చిన వరం అని ఆయన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ఆయన అడుగు జాడాల్లో నడవాలని కోరారు. ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు మాట్లాడుతూ పేపర్ బాయ్ స్థాయి నుండి మిసైల్ మాన్ స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలామ్ అని కీర్తించారు. ఈ కార్యక్ర మం లో వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి , డీన్ ఆర్ అండ్ డి డా. ఎస్. పిచ్చి రెడ్డి , ఎన్. ఎస్ .ఎస్ ప్రోగ్రా మ్ ఆఫీసర్ డా.బి.శివహరి ప్రసాద్ , డీన్స్ మరియు వివిధ విభాగాధిపతులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



# 48 గంటల కాల్పుల విరమణకు పాక్ తాలిబన్ల అంగీకారం

## అఫ్ఘాన్ బోర్డర్‌లో తెగబడిన పాకిస్థాన్ దళాలు

### తెల్లవారుజామున భీకరదాడులు

పెషావర్, అక్టోబరు 16 : ఆఫ్గన్‌పాక్ సరిహద్దుల్లో జరుగుతున్న దాడులకు తాత్కాలిక విరామం లభించింది. రెండు వైపులా అటు పాక్ దళాలు ఇటు ఆఫ్గన్ తాలిబన్ పాలకులు కూడా 48 గంటలపాటు కాల్పుల విరమణకు అంగీకరించారు. బుధవారంసాయంత్రం 5.30 గంటలనుంచి ఈ ఒప్పందం అమలులోకి వస్తుందని పాక్ సర్కార్‌ప్రకటించింది. తాజాగా జరిగిన దాడుల్లో ఒకరిపైకి ఒకరు తీవ్రస్థాయిలో కాల్పులుజరపడంతో డజనుకుపైగా పౌరులు,అదే సంఖ్యలో ఆర్మీ దళాల సభ్యులు చనిపోయారు. మొత్తం ఈ వారాంతంలోనే 50 మందివరకూ చనిపోయినట్లు తేలింది. దీనితో అటు పాక్ సైన్యం, ఇటు తాలిబన్లు ఇరువురు కూడా చర్చలవరంగా స్వల్ప విరామానికి అంగీకరించారు. రెండువైపులా కూడా చర్చల ద్వారానే సానుకూల పరిష్కారానికి మొగు చూపించడంవల్లనే ఈ అవగాహనకు రావడం జరిగిందని పాక్ విదేశాంగశాఖ ప్రక టించింది. 2600 కిలోమీటర్ల సరిహద్దు పొడవునా ఇక రానున్న రోజుల్లో కాల్పులు హింసను నివారించేందుకే ఈ విరమణ అవగాహనకు రావడంజరిగిందని, వెంటనే చర్చలు ప్రారంభించి సానుకూల పరిష్కారం కనుగొనాలన్నదే పాక్ అభిమతమని వెల్లడిం చింది. కాబూల్‌లో 2021లో తాలిబన్ల పాలన చేపట్టినప్పటినుంచి పాక్ సరిహద్దుల్లో ఎడతెగని కాల్పులు జరుగుతూనే ఉన్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కుర్రం సెక్టార్‌లో ఈ తెల్లవారుజామున ఇరు దేశాల సైనికుల మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ దాడుల్లో ఆఫ్ఘన్ సైన్యానికి చెందిన పలు ట్యాంకులు, సైనిక పోస్టులు ధ్వంసమైనట్లు పాకిస్థాన్ వెల్లడించింది. పాక్ భద్రతా వర్గాల సమాచారం ప్రకారం ఆఫ్ఘన్ తాలిబన్ దళాలు, తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు కలిసి తమ సైనిక పోస్టులపై ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు లేకుండా కాల్పులకు తెగబడ్డారని పాకిస్థాన్ ఆరోపించింది. దీంతో పాక్ జరిపిన ఎదురుదాడుల్లో ఆఫ్ఘన్ సైనిక పోస్టులు తీవ్రంగా దెబ్బ తిన్నాయని, ఒక ట్యాంకు మంటల్లో కాలిపోయిందని, దీంతో తాలిబన్ సైనికులు తమ స్థావరాల నుంచి పారిపోయారని పాక్ మీడియా పేర్కొంది. మరో ఆఫ్ఘన్ పోస్టును, ట్యాంకును కూడా నాశనం చేసినట్లు తరువాత వెల్లడించింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని ఖోస్త్ ప్రావిన్స్ డిప్యూటీ పోలీస్ ప్రతినిధి తాహిర్ అహ్రార్ ఈ ఘర్షణలను ధ్రువీకరించినప్పటికీ, పూర్తి వివరాలు వెల్లడించలేదు. ఈ వారంలో ఇరు దేశాల మధ్య కాల్పులు జరగడం ఇది రెండోసారి. గత శనివారం నుంచి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఆ ఘర్షణల్లో తమ సైనికులు 23 మంది మరణించారని, ప్రతిగా 200 మందికి పైగా తాలిబన్, అనుబంధ ఉగ్రవాదులను హతమార్చామని పాకిస్థాన్ ప్రకటించింది. అయితే, తమ భూభాగంపై పాక్ దాడులకు ప్రతీకారంగా 58 మంది పాక్ సైనికులను చంపినట్లు కాబూల్ తెలిపింది. సౌదీ అరేబియా, ఖతార్ దేశాలు జోక్యం చేసుకున్నప్పటికీ ఉద్రిక్తతలు చల్లారలేదు. దీంతో ఇరు దేశాల మధ్య అన్ని సరిహద్దు క్రాసింగ్‌లను ఇప్పటికే మూసివేశారు. తమ దేశంలో దాడులకు పాల్పడుతున్న టీటీపీకి ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్థాన్ ఆరోపణలను కాబూల్ ఖండిస్తూ వస్తోంది.

# బీహార్‌లో పార్టీల సిగపట్లు

- మహాకూటమిలో కొలిక్కిరాని సీట్ల సర్దుబాటు - 57మందితో జెడియు తొలి జాబితా విడుదల - బిజెపి రెండో జాబితాలో సింగర్ మైథిలికి చోటు

- ఎల్‌జెపి నాలుగు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన - రాఘోపూర్‌లో తేజస్వి యాదవ్ నామినేషన్, పోటీ చేయట్లేదు: ప్రశాంత్ కిశోర్ స్పష్టీకరణ

నితీశ్ కుమార్ ప్రచారం షురూ - నమో యాప్ ద్వారా పార్టీ శ్రేణులతో మోడీ భేటీ



పాట్నా, అక్టోబరు 16 : బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పార్టీల మధ్య సీట్ల సర్దుబాబు ఇంకా కొలిక్కిరాలేదు. ఎన్‌డిఎలో సర్దుబాటు కుదిరినా, కేటాయించిన సీట్లపై ఇటు చిరాగ్ పాశ్వాన్, అటు జితిన్ మాంఝీ అసంతృప్తితో ఉన్నారు. తాజాగా తాము కోరుతున్న స్థానాలలో జెడియు అభ్యర్థుల పేర్లు ప్రకటనపై చిరాగ్ పాశ్వాన్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నితీశ్ తీరును తూర్పారపడుతున్నారు. ఈ విషయమై అమిత్ షాతోనే తేల్చుకుంటానని చిరాగా పాశ్వాన్ ప్రకటించారు. సీట్ల సర్దుబాటుపై రాష్ట్రీయ లోక్ మోర్చా(ఆర్‌ఎల్‌పి) చీఫ్, రాజ్యసభ సభ్యుడు ఉపేంద్ర కుశ్వాహా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు మహాఘట్ బంధన్‌లో సీట్ల సర్దుబాబు కుదరలేదు. కాంగ్రెస్ అగ్రనేతలతో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. దీంతో ఢిల్లీ నుంచి హుటాహుటిన పాట్నాకు చేరుకుని రాఘోపూర్‌లో ఆర్‌జెడి తరఫున తేజస్వీ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్, మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి తదితరులు తేజస్వి వెంట ఉన్నారు. మహాకూటమి సీట్ల సర్దుబాటుపై నేడు మరోమారు సమాలోచనలు జరుపనున్నారు. టికెట్లపై నేతల మధ్య వాదోపవాదనలు, నిరసనల మధ్య బుధవారంనాడు జెడియు 57 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. మంత్రులు విజయ్‌కుమార్ చౌదరి, శర్వాన్ కుమార్, మదన్ సాహ్ని తదితరుల పేర్లు జాబితాలో ఉన్నాయి. నలుగురికి తప్ప మిగిలిన సిట్టింగ్‌లందరికీ జెడియు టికెట్లు కేటాయించింది. ఇందులో చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్‌జనశక్తి పార్టీ కోరుతున్న స్థానాలున్నాయి. దీనిపై జెడియు- ఎల్‌జెపి నేతల మధ్య మాటల యుద్ధం చెలరేగింది. ఇక టికెట్ల కేటాయింపులో తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఎంపి అజయ్ మండల్ మంగళవారం పార్టీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే గోపాల్ మండల్ సిఎం నితీశ్ నివాసం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఇదిలా ఉండగా, బిజెపి 12 మంది సభ్యులతో రెండో విడత జాబితా విడుదల చేయగా, ప్రముఖ సింగర్ మైథిలీ ఠాగూర్ పేరుంది. ఆమె అలీనగర్ నుంచి బరిలో దిగనున్నారు. ఐపిఎస్ ఆఫీసర్ ఆనంద్ మిశ్రా బుక్సర్ నుంచి పోటీచేస్తున్నారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జెపి (ఆర్‌వి) బుధవారంనాడు 4 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఎన్‌డిఎ భాగస్వామి అయిన ఎల్‌జెపికి 29 స్థానాల్లో పోటీ చేయనుంది. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీని నెలకొల్పి, బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను నిలబెడుతున్నారు. ఇప్పటికే రెండు విడతల జాబితా విడుదల చేశారు. అయితే, ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయట్లేదని ప్రశాంత్ కిశోర్ స్పష్టం చేశారు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం రాష్ట్రమంతా ప్రచారం చేయాల్సి ఉన్నందున తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్ పోటీ చేస్తున్న రాఘోపూర్ నుంచి ప్రశాంత్ కిశోర్ పోటీ చేస్తారని రాజకీయ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం సాగింది. పీకే ప్రకటనతో ఆ అంశానికి తెరపడింది. ఇక ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో మంగళవారంనాడు జరిగిన కేంద్ర ఎన్నికల కమిటీ (సిఇసి) సమావేశంలో 18 మంది అభ్యర్థులను ఖరారు చేయగా, మిగిలిన స్థానాలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై సబ్ కమిటీని వేసింది. నామినేషన్లకు ఈనెల 17 ఆఖరి తేదీ కావడంతో అన్ని పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గురువారం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. అటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం సాయంత్రం నమో యాప్ ద్వారా పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు.

'ఐక్య ఎన్‌డిఎ, ఐక్య బీహార్, మరోమారు సుస్థిర ప్రభుత్వం' నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి కార్యకర్తలు తమ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబాన్ని కలవాలని, ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు, ప్రయోజనాల గురించి తెలియజేయాలని ప్రధాని మోడీ విజ్ఞప్తి చేశారు. ప్రతి బూత్ బలంగా ఉన్నప్పుడే పార్టీ గెలుస్తుందనే అంశాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

## కేరళలో కన్నుమూసిన కెన్యా మాజీ ప్రధాని ఒడింగా



ఎర్నాకుళం, అక్టోబరు 16 : కెన్యా మాజీ ప్రధాని రైలా ఒడింగ కేరళలో కన్నుమూశారు. ఎర్నాకుళం జిల్లాలోని కూత్తకూళంలో ఉన్న ఆయుర్వేదిక కంటి ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. క్యాంపస్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో ఆయనకు గుండెపోటు వచ్చింది. ఆయన వయసు 80 ఏళ్లు. ఇవాళ ఉదయం 9 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు శ్రీధరీయం ఆయుర్వేదిక్ ఐ హాస్పిటల్ అండ్ రీసర్చ్ సెంటర్ పేర్కొన్నది. గత అయిదు రోజుల నుంచి ఆయన ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనతో పాటు ఆయన కుమార్తె, పర్సనల్ డాక్టర్ ఉన్నారు. కెన్యా రాజకీయాల్లో రైలా ఒడింగాకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఆయన 2008 నుంచి 2013 వరకు ప్రధానిగా పనిచేశారు. ఆయుర్వేదిక కంటి ఆస్పత్రిలో గతంలో ఆయన కుమార్తె చికిత్స తీసుకున్నది. ఆమె కంటిచూపు మెరుగైన నేపథ్యంలో అదే ఆస్పత్రిలో మాజీ ప్రధాని ఒడింగా కూడా చికిత్స తీసుకుంటున్నారు. మాజీ ప్రధాని రైలా ఒడింగా మృతి సమాచారాన్ని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్(ఎఫ్ఆర్ఆర్ఓ) ఆఫీసుకు తెలియజేశారు. అయిదుసార్లు ఆయన దేశాధ్యక్ష పదవి కోసం పోటీపడ్డారు. కానీ ఒక్కసారి కూడా నెగ్గలేదు. 1945 జనవరి 7వ తేదీన పుట్టిన రైలా ఒడింగా కెన్యా రాజకీయాల్లో ఒక గొప్ప నాయకుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. కెన్యాలో ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమకారుడిగా ఆయన 8 ఏళ్ల పాటు జైలుకు వెళ్లారు. 1992లో కెన్యా పార్లమెంట్‌లోకి అడుగుపెట్టిన రైలా ఒడింగా 2007 అధ్యక్ష ఎన్నికల తర్వాత చెలరేగిన హింసను చల్లార్చడానికి 2008 ఫిబ్రవరిలో కుదిరిన అధికార భాగస్వామ్య ఒప్పందం ద్వారా ఆయన కెన్యా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2010లో కెన్యా కొత్త రాజ్యాంగం ప్రకారం ఆయన ప్రధానమంత్రి పదవి రద్దు చేశారు. ఆయన 1997, 2007, 2013, 2017, 2022ల్లో ఐదుసార్లు కెన్యా అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. చివరి 4 ఎన్నికల్లోనూ తాను మోసపోయినట్లు ప్రకటించారు. రైలా ఒడింగా మరణవార్త తెలుసుకుని ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తన ప్రియ మిత్రుడు కెన్యా మాజీ ప్రధాని రైలా ఒడింగా మరణవార్త విని తాను చాలా బాధపడినట్లు ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. రైలా ఒడింగా ఒక గొప్ప రాజనీతిజ్ఞుడని మన దేశానికి ప్రియమైన మిత్రుడని కొనియాడారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఆయనతో పరిచయం ఉందని.. భారతదేశం అన్నా.. భారత సంస్కృతి, విలువలు, ప్రాచీన జ్ఞానంపై ఆయనకు ప్రత్యేక అభిమానం ఉందని ప్రధాని మోదీ తెలిపారు. ఆయుర్వేద చికిత్సతో తన కుమార్తె జబ్బు నయం కావడంతో ఆయన ఆయుర్వేదం, సాంప్రదాయ వైద్యంపై ఇష్టం పెంచుకున్నారని తెలిపారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు, కెన్యా ప్రజలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని మోదీ ట్వీట్ చేశారు.

# సమితి మానవ హక్కుల మండలికి ఏడోసారి భారత్ ఎన్నిక

### 2006నుంచి క్రమం తప్పకుండా యుఎన్‌హెచ్‌ఆర్‌సిలో భారత్ ప్రాతినిధ్యం



న్యూయార్కు, అక్టోబరు 16 : ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలికి వరుసగా ఏడోసారి కూడా భారత్ ఎన్నికయింది. 2026-28 కాలానికిగాను భారత్ హెచ్‌ఆర్‌సి మండలిలో కొనసాగుతుంది. సమితిలో శాశ్వత రాయబారి పర్వతనేని హరీష్ స్పందిస్తూ భారత్‌కు అనూహ్యంగా మద్దతు పలికినందుకు ధన్యవాదాలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు భారత్ చేస్తున్న కృషి, ప్రాథమిక స్వేచ్ఛకు చూపించే చొరవ ఈ ఎన్నికరుజువుచేసిందని హరీష్ అన్నారు. మా పదవీకాలంలో లక్ష్యాల సాధనకు అవిరళ కృషిచేస్తామన్నరు. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల మండలలో 47 మంది సభ్యుల ఉంటారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధుల సభ మూడేళ్ల కాలానికిగాను భౌగోళిక నిబంధనల ఆధారంగా ఎన్నుకుంటుంది. ఐదు ప్రాంతీయ గ్రూపుల ఆధారంగా ఈ ఎన్నిక ఉంటుంది. ఆఫ్రికా దేశాలకు 13, ఆసియా పసిఫిక్ దేశాలకు 13, తూర్పు ఐరోపా దేశాలకు ఆరు, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలకు ఎనిమిది, పశ్చిమయూరోప్ ఇతర దేశాలకు ఏడు స్థానాలుంటాయి. భారత్ మానవహక్కుల మండలిలో 2024నుంచి కొనసాగుతోంది. అయితే ఒక్కఏడాదిమాత్రమే గ్యాప్ తీసుకుంది. 2011నుంచి 2018వరకూ తిరిగి 2025లో కూడా హక్కుల మండలిలోభారత్ ప్రాతినిధ్యం ఉంది. 2006లో భారత్ 190సభ్యదేశాల్లో 173 ఓట్ల మెజార్టీతో ఎన్నికయింది. 2006నుంచి అప్రతిహతంగా ఎన్నికవుతూ వచ్చిన భారత్‌కు అన్నిదేశాలమద్దతుంది. అంగోలా, చిలీ, ఈక్వెడార్, ఈజిప్టు, ఎస్తోనియా, ఇరాక్, ఇటలీ, మారిషస్; పాకిస్తాన్, సాల్వేనియా, దక్షిణాఫ్రికా, యుకె, వియత్నాం దేశాలు కూడా 2026 జనవరినుంచి ప్రారంభం అయ్యే పదవీకాలానికి సమితి మానవహక్కుల మండలిలో కొనసాగుతాయి.

## 50 యేళ్లనాటి హత్యాయత్నం కేసు నిందితుడు అరెస్ట్!

ముంబయి, అక్టోబరు 16 : యాభై ఏళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఓ నిందితుడిని ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. 48 ఏళ్ల క్రితం నాటి హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి, ఇప్పుడు 71 ఏళ్ల వయసులో పోలీసులకు చిక్కడం సంచలనం సృష్టిస్తోంది. ఈ సుదీర్ఘ వేటకు ఒక పాత రోడ్డు ప్రమాదం కేసు కీలకంగా మారింది. 1977లో ముంబైలోని కొలాబా ప్రాంతంలో చంద్రశేఖర్ మధుకర్ కాలేకర్ అనే 23 ఏళ్ల యువకుడు తన ప్రియురాలిపై కత్తితో దాడి చేశాడు. ఆమె మరొకరితో సన్నిహితంగా ఉంటోందనే అనుమానంతో ఈ దారుణానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో పోలీసులు అతడిని అరెస్ట్ చేయగా, కొద్దిరోజులకే బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఆ తర్వాత కోర్టు విచారణకు హాజరుకాకుండా అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి అతడి కోసం పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. ఎన్ని వారెంట్లు జారీ చేసినా ఆచూకీ లభించకపోవడంతో అతడిని పరారీలో ఉన్న నేరస్థుడిగా ప్రకటించారు. దాదాపు 48 ఏళ్లుగా మూలనపడిన ఈ కేసును ఆరు నెలల క్రితం కొలాబా పోలీసులు మళ్లీ తెరిచారు. కాలేకర్ పాత చిరునామా అయిన లాల్‌బాగ్‌లోని హాజీ కాసమ్ చాల్‌కు వెళ్లి చూడగా, ఆ ప్రాంతం పూర్తిగా మారిపోయి కొత్త భవనం వెలసింది. ఓటర్ల జాబితాతో పాటు ఇతర ప్రభుత్వ రికార్డులను జల్లెడ పట్టినా ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలో రవాణా శాఖ, కోర్టు రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులకు ఒక కీలక ఆధారం లభించింది. రత్నగిరి జిల్లాలోని దాపోలి పోలీస్ స్టేషన్‌లో 2015లో కాలేకర్‌పై రోడ్డుపై జరిగిన గొడవకు సంబంధించి ఒక కేసు నమోదైనట్లు గుర్తించారు. ఆ కేసులో ఉన్న చిరునామా ఆధారంగా పోలీసులు సోమవారం రాత్రి దాపోలిలోని అతడి ఇంటికి చేరుకున్నారు. 48 ఏళ్ల తర్వాత తమ ఇంటి తలుపు తట్టిన పోలీసులను చూసి కాలేకర్ నిర్ఘాంతపోయాడు. "అసలు ఆ పాత కేసు గురించే దాదాపు మరిచిపోయానన్నారు.

## మహాభారత్ కర్ణుడు పంకజ్ ధీర్ కన్నుమూత



న్యూఢిల్లీ, అక్టోబరు 16 : బీఆర్ చోప్రా తీసిన మహాభారత్ సీరియల్‌లో కర్ణుడి పాత్ర పోషించిన ప్రఖ్యాత నటుడు, టీవీ స్టార్ పంకజ్ ధీర్ ఇక లేరు. ఆయన వయసు 68 ఏళ్లు. క్యాన్సర్‌తో పంకజ్ బాధపడుతున్నట్లు తెలిసింది. ఫ్యాంటసీ డ్రామా చంద్రకాంతలో శివదత్తు చక్రవర్తి పాత్రను ఆయన పోషించారు. క్యాన్సర్ వల్ల బుధవారం ఉదయం ఆయన మృతిచెందినట్లు తెలిపారు. గత కొన్ని నెలల నుంచి ఆయన చికిత్స తీసుకుంటున్నట్లు ప్రొడ్యూసర్ అశోక్ పండిట్ తెలిపారు. మధ్యాహ్నం పంకజ్ ధీర్‌కు అంత్యక్రియలు నిర్వహించారు. పంకజ్ ధీర్‌ది పంజాబ్. 1980 దశకంలో ఆయన నటుడిగా కెరీర్ స్టార్ట్ చేశారు. చాలా వరకు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించేవారు.

అయితే దూరదర్శన్ టీవీలో 1988లో ప్రసారం అయిన మహాభారత్ సీరియల్‌లో కర్ణుడి పాత్రను ఆయన పోషిం చారు. ఆ సీరియల్ తర్వాత ఆయన పాపులార్టీ చాలా పెరిగిపోయింది. ఆ తర్వాత సడక్, సనమ్ బెవఫా, ఆశిక్ అవారా లాంటి చిత్రాల్లో నటించాడు. 1994 నుంచి 1996 వరకు చంద్రకాంత టీవీ సీరియల్‌లో నటించారు.

# చైనాను కట్టడిచేయాలంటే భారత్ సాయపడాల్సిందే

### అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్

వాషింగ్టన్, అక్టోబరు 16 : ప్రపంచంలోనే అరుదైన ఖనిజాల విషయంలో చైనా పోకడను అమెరికా తప్పుబట్టింది. చైనాలో దొరికే ఈ అరుదైన ఖనిజాలపై అక్కడి ప్రభుత్వం కట్టడిచేస్తోందని, తద్వారా ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఈ ధోరణిని అమెరికా సహించబోదని ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ స్పష్టం చేశారు. ఈ విషయంలో చైనాను ఎదుర్కోవాలంటే తమకు భారత్ సాయం కావాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు దిగుమతుల వ్యవహారంలో భారత్ పై అమెరికా భారీగా పన్నులు విధించిన విషయం తెలిసిందే. అయితే, చైనా విషయంలో మాత్రం భారత్ తమకు సాహాయం చేయాలని అమెరికా కోరడం గమనార్హం. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఇటీవల ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రపంచంలో మరెక్కడా లభించని అరుదైన ఖనిజాల ఎగుమతిపై చైనా ఇటీవల నియంత్రణ విధించిందని చెప్పారు. విదేశీ కంపెనీలు వాటిని దిగుమతి చేసుకోవాలంటే చైనా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలనే షరతు విధించిందన్నారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్ష సవాలేనని బీజింగ్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. ఇది చైనాకు, ప్రపంచ దేశాలకు మధ్య నెలకొన్న పోటీ అని ప్రపంచ పంపిణీ వ్యవస్థలపై చైనా గురిపెట్టిందని ఆయన మండిపడ్డారు. బీజింగ్ దూకుడును అమెరికా అడ్డుకుంటుందన్నారు. ఇందుకోసం భారత్, ఐరోపా దేశాల మద్దతు కావాలని వెల్లడించారు. అమెరికా ప్రపంచ శాంతిని కోరుకుంటుంటే.. చైనా ఆర్థిక యుద్ధం చేస్తోందని స్కాట్ బెసెంట్ దుయ్యబట్టారు.

## సంక్షిప్తంగా..

### కేదార్‌నాథ్ యాత్రికుల కోసం అదాని రోప్‌వే ప్రాజెక్టు



అహ్మదాబాద్, అక్టోబరు 16 : కేదార్‌నాథ్ ధామ్ దర్శనానికి వెళ్లే భక్తుల సౌలభ్యం కోసం అదానీ గ్రూప్ ఒక భారీ రోప్‌వే నిర్మాణాన్ని చేపడుతోందని ఆ సంస్థ ఛైర్మన్ గౌతమ్ అదానీ బుధవారం ప్రకటించారు. ఈ రోప్‌వే అందుబాటులోకి వస్తే.. కష్టతరమైన పుణ్యక్షేత్ర యాత్ర మరింత సులభంగా, సురక్షితంగా మారుతుందని ఆయన తెలిపారు. సోన్‌ప్రయాగ్ నుంచి కేదార్‌నాథ్‌ను కలుపుతూ నిర్మించనున్న ఈ రోప్‌వే ప్రాజెక్టుకు మొత్తం రూ. 4,081 కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం 9 గంటలపాటు కష్టపడి చేయాల్సిన కాలి నడక ప్రయాణ సమయాన్ని ఈ రోప్ వే కేవలం 36 నిమిషాలకు తగ్గిస్తుంది. మొత్తంగా ఇది 12.9 కిలో మీటర్ల దూరం ఉండగా.. అరగంటలోనే అక్కడకు చేరుకోవచ్చు. కేదార్‌నాథ్ ధామ్‌కు వెళ్లే కఠినమైన అధిరోహణ ఇప్పుడు సులభమవుతుంది. భక్తుల పుణ్యయాత్రను మరింత సరళంగా, సురక్షితంగా మార్చడానికి అదానీ గ్రూప్ ఈ రోప్‌వేను నిర్మిస్తోందని గౌతమ్ అదానీ వెల్లడించారు.

### రహస్య సమాచారం కాజేసిన విదేశాంగ నిపుణుడి అరెస్టు



వాషింగ్టన్, అక్టోబరు 16 : అమెరికా ప్రభుత్వానికి సలహాదారుడిగా పనిచేసిన భారత మూలాలున్న విదేశాంగ నిపుణుడు ఆష్లే టెల్లిస్ అరెస్ట్ అయ్యారు. అమెరికాకు చెందిన రహస్య సమాచారాన్ని తన దగ్గరే దాచుకున్నారని, అలాగే చైనా అధికారులతో సీక్రెట్ మీటింగ్‌లు జరిపినట్లు ఆరోపణలతో కేసు నమోదు చేసినట్లు అమెరికా ప్రాసిక్యూటర్లు తెలిపారు. ఈ క్రమంలోనే అమెరికా అధికారులు టెల్లిస్‌ను అరెస్ట్ చేసినట్లు వార్తలొచ్చాయి. యూఎస్ న్యాయవాది లిండ్సే హాలిగన్ ఆష్లేపై ఉన్న ఆరోపణలును గురించి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం, 64 ఏళ్ల ఆష్లే టెల్లిస్ రెండు దశాబ్దాలుగా అమెరికా ప్రభుత్వంలో సలహాదారుడిగా సేవలదించారు. 2001 నుంచి డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌లో కాంట్రాక్టర్‌గా పనిచేశారు.

### త్వరలో వందేభారత్ 4.0: రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, అక్టోబరు 16 : భారతదేశపు సెమీ హై స్పీడ్ రైళ్ల జాబితాలో తర్వాత వర్షన్ రానుంది. వందేభారత్ 4.0ను అభివృద్ధి చేయనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. ఎగుమతి గిరాకీలకు అనుగుణంగా దాని రూపకల్పన ఉంటుందని వెల్లడించారు. రైళ్ల ఆధునిక సాంకేతికత విషయంలో దేశాన్ని గ్లోబల్ సప్లయిర్‌గా మార్చే దిశగా ఇది కీలక అడుగు కానుందని వెల్లడించారు. సిఐఐ ఇంటర్నేషనల్ రైల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి మాట్లాడారు. మోడీ ప్రభుత్వం రైల్వేల అభివృద్ధిపై బలంగా దృష్టి సారించిందని వెల్లడించారు. 11 ఏళ్లలో 35,000 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌ల నిర్మాణం జరిగిందని చెప్పారు. జపాన్ బుల్లెట్ రైల్ నెట్‌వర్క్ మాదిరిగానే హైస్పీడ్ ప్యాసింజర్ రైల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పారు. గరిష్టంగా గంటకు 350 కిలోమీటర్ల వేగంతో రైలు ప్రయాణించేలా వాటి డిజైన్ ఉంటుందని తెలిపారు.

### ఇళయరాజా స్టూడియో, రాయబార కార్యాలయాలకు బాంబు బెదరింపులు



చెన్నై, అక్టోబరు 16 : తమిళనాడులో మరోసారి బాంబు బెదిరింపులు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా చెన్నైలోని పలు విదేశీ రాయబార కార్యాలయాలతో పాటు ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా స్టూడియోకు ఈ తరహా బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. చెన్నైలోని అమెరికా, రష్యా, ఇంగ్లాడ్, థాయిలాండ్, శ్రీలంక, సింగపూర్ కార్యాలయాలకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ మెయిల్స్ వచ్చాయి. బాంబు పేలుళ్లు జరగనున్నట్లు ఆ సందేశాల సారాంశం. దీంతో పోలీసులు ఆయా కార్యాలయాల వద్ద ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఇక, చెన్నై టి.నగర్‌లోని ఇళయరాజా స్టూడియోకు బాంబు బెదిరింపు వచ్చింది. డిజిపి ఆఫీసుతో పాటు ఇళయరాజాకు మెయిల్ ద్వారా ఈ బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే బాంబ్ స్క్వాడ్‌తో స్టూడియోకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. అయితే అక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు.

# దీపావళి రోజు ఢిల్లీలో గ్రీన్‌క్రాకర్స్‌కు సుప్రీం అనుమతి

న్యూఢిల్లీ, అక్టోబరు 16 : దీపావళి పండుగ సమీపిస్తున్న వేళ, దేశ రాజధాని ఢిల్లీలో టపాసుల వినియోగంపై సుప్రీంకోర్టు కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ హితమైన గ్రీన్ క్రాకర్స్‌ను పరిమితంగా కాల్చుకునేందుకు అనుమతినిస్తూ, ఈ నెల 18 నుంచి 21 వరకు నాలుగు రోజుల పాటు వెసులుబాటు కల్పించింది. అయితే, ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోకి బయటి ప్రాంతాల నుంచి టపాసులను తీసుకురావడాన్ని పూర్తిగా నిషేధించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. "బయటి నుంచి అక్రమంగా తరలించే టపాసుల వల్లే పర్యావరణానికి ఎక్కువ నష్టం వాటిల్లుతోంది. మనం పర్యావరణంతో రాజీ పడకుండా, సంయమనంతో కూడిన సమతుల్య విధానాన్ని అనుసరించాలి" అని భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. తక్కువ ముడిసరుకులతో, ధూళిని తగ్గించేలా తక్కువ ఉద్గారాలను వెలువరించే వాటిని "గ్రీన్ క్రాకర్స్"గా పరిగణిస్తారు. ప్రస్తుతం తాము ఇచ్చిన ఆదేశాలు కేవలం తాత్కాలిక చర్య మాత్రమేనని కోర్టు స్పష్టం చేసింది. నిర్దేశించిన నాలుగు రోజుల్లో ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలోని వాయు నాణ్యత సూచీని నిరంతరం పర్యవేక్షించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించింది. దీనిపై సమగ్ర నివేదికను తమకు సమర్పించాలని సూచించింది. ఈ నివేదిక ఆధారంగా భవిష్యత్తులో తదుపరి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. ఈ తీర్పు ప్రకారం దీపావళి సంబరాల్లో ప్రజలు గ్రీన్ క్రాకర్స్‌ను కాల్చుకోవచ్చు. అయితే ఈ అనుమతి కొన్ని కఠినమైన షరతులకు లోబడి మాత్రమే ఉంటుంది. గ్రీన్ క్రాకర్స్ అమ్మకాలకు అక్టోబర్ 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మాత్రమే.

## పాస్‌పోర్టుల జాబితాలో పడిపోయిన యుఎస్ ర్యాంకు!

న్యూఢిల్లీ, అక్టోబరు 16 : అగ్రరాజ్యం అమెరికాకు షాక్ తగిలింది. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితా నుంచి పడిపోయింది. 20 సంవత్సరాల తర్వాత తొలిసారిగా యూఎస్ పాస్‌పోర్ట్ టాప్10 నుంచి దిగజారింది. హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ ఆధారంగా విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో అమెరికా 12వ స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం, మలేషియాతో కలిసి యూఎస్ 12వ స్థానంలో నిలిచింది. అమెరికా పాస్‌పోర్ట్ హోల్డర్లు ఇప్పుడు కేవలం 180 దేశాలకు మాత్రమే వీసా లేకుండా ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. ఇక, ఈ జాబితాలో సింగపూర్ అగ్రస్థానంలో నిలిచింది.

# ఆడపిల్లల సంఖ్యను పెంచుదాం - ఆడ, మగ సముతుల్యాన్ని సాధిద్దాం



○ **నందులపేటపట్టణఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక**

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** గర్భస్థ పూర్వ మరియు గర్భస్థ పిండ ప్రక్రియ నిషేధ చట్టం 1994 నిబంధనలను అనుసరించి ప్రజలకు తెలియజేస్తూ సమాజంలో స్త్రీ,పురుషులు ఇరువురు సమానమేనని,స్త్రీ పురుషుల మధ్య ఎలాంటి వివక్ష ఉండకూడదని నందుల పేట పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక అన్నారు.

ఈ చట్టం గర్భం ధరించడానికి ముందుగానీ, గర్భం ధరించిన తర్వాత గాని ,పుట్టబోయే బిడ్డ యొక్కలింగ నిర్ధారణను నిరోధిస్తుంది. సంబంధిత గర్భిణీకి గాని ఆమె బంధువులకు గాని ఏ విధమైన వివరాలను వెల్లడించడం నిషేధం. ఈ చట్టం గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని ఆరోగ్య సిబ్బందికి తెలియజేశారు. ఎవరైనాను లింగ నిర్ధారణ విషయంలను బయటకు వెల్లడించినచో చట్టప్రకారం జైలుశిక్ష విధించబడునని తెలియజేశారు. గర్భస్థ పిండ స్త్రీ అని తెలియగానే గర్భస్థ పిండహత్యను పాల్పడితే తమకే కాక సమాజానికి కూడా ఎంతో ద్రోహం చేసిన వారు అవుతారు.

పుట్టబోయే శిశువు ఆడైనా మగ అయినా అందుకు కారణం తండ్రి అనే విషయం ప్రజలు తెలుసుకోవాలనీ,తరాలు మారిన ఆడపిల్లలైనా చిన్నచూపు చూడకూడదని దయచేసి ఆడపిల్లలను గర్భంలోనే త్రుంచి వేయకండి నేటి తరానికి అమ్మతనాన్ని అందించనివ్వండి అని తెలియజేశారు ఈ సమావేశానికి ఆరోగ్య విస్తరణాధికారిఅందె బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్ చింతలప్రసన్నపుష్పలత, సూపర్వైజర్ బండారు మల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ దీపాలశ్రీనివాసరావు,అలావేణు గోపాలరావు, హరికృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొన్నూరు ఆసుపత్రిలో రికార్డులు భద్రం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** పొన్నూరు ఆసుపత్రిలో రికార్డులు భద్రంగా ఉన్నాయని పొన్నూరు సి. హెచ్.సి వైద్య అధికారి ఫిరోజ్ ఖాన్ గురువారం తెలిపారు. ఆ ఆసుపత్రి పై వస్తున్న ఆరోపణలపై ఆయన స్పందించారు. పొన్నూరు ఆసుపత్రిలో అన్ని రికార్డులు భద్రపరచడం జరిగిందన్నారు. నిధులకు సంబంధించిన కొన్ని ఫైల్స్ ఆడిట్ ఉన్నందున అప్పటిలో జూనియర్ అసిస్టెంట్ తీసుకువెళ్ళడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు అన్ని అందుబాటులో ఉండడం జరుగుతుందని, అత్యవసర మందులు అరుదుగా కొరత ఉన్నప్పుడు మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. మందుల కొనుగోలులో ఎవరైతే తక్కువ కొటేషన్ సమర్పిస్తారో వారి వద్ద మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రెండు వందల పడకల పైబడిన ఆసుపత్రులకు మాత్రమే టెండర్ పద్ధతి అమలులో ఉంటుందని, 30 పడకల ఆసుపత్రికి టెండర్ పద్ధతి వర్తించదని పేర్కొన్నారు. ఫార్మసీ విభాగానికి సంబంధించిన లెక్కలు, పత్రాలు కొనుగోలుకు సంబంధించిన వివరాలు అన్ని సరయిన విధంగా ఉంచడం జరిగిందని, ఆసుపత్రిలో ఎటువంటి దాపరికాలు, పక్షపాతములు, సిఫారుసులు లేవని వివరణ ఇచ్చారు.

# "మెప్మా వ్యవస్థలో పారదర్శకతకు ప్రాధాన్యం - అవినీతికి తావులేదు"

○ **గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మెప్మా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

○ **ప్రతి స్థాయిలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థ కావాలన్న ఆదేశాలు**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మెప్మా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ మెప్మా కార్యాలయాల పనితీరులో పారదర్శకత పూర్తిగా ఉండాలన్నారు. ప్రతి సీఈఓ, ప్రతి ఆర్పీతో, ప్రతి ఆర్పీ తమ పరిధిలోని గ్రూపులతో క్రమం తప్పకుండా మీటింగ్‌లు ఏర్పాటు చేసి, ఆ సమావేశాల మినిట్స్‌ను నమోదు చేసి సంబంధిత అధికారులకు నివేదించాల్సిన అవసరం ఉందన్నారు. మెప్మా వ్యవస్థలో డేటా పారదర్శకత పూర్తిగా లోపించిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. వందల కోట్ల రూపాయల స్కామ్‌లకు సంబంధించిన ఫిర్యాదులు బయటకు వచ్చినా ఇప్పటికీ వ్యవస్థను సరిచేసే ప్రయత్నం జరగలేదన్నారు. బ్యాంకులు, సీఈఓలు, సీఎంఓలు వంటి అన్ని స్థాయిల్లో పారదర్శకత లేకుండా జరిగే అక్రమాల పై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా కింది స్థాయిలో ఉన్న మెప్మా సిబ్బంది పనిచేస్తే వారి పై చర్యలు తీసుకొవాలని అధికారులను ఆదేశించారు. డ్వాక్రా పథకాన్ని రాష్ట్రానికి తీసుకువచ్చినది చంద్రబాబు నాయుడేనని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుర్తు చేశారు. మహిళా సాధికారత కోసం రూపొందించిన ఈ వ్యవస్థను మరింత ప్రభావవంతంగా కొనసాగించడం అందరి బాధ్యత అని చెప్పారు. మహిళల ఆత్మనిర్భరత కోసం ఈ పథకం ఆయన ఆలోచనలో నుంచి పుట్టినదని, దాని స్ఫూర్తిని కాపాడే విధంగా వ్యవస్థను నడిపించాలని సూచించారు. "మెప్మా సిబ్బంది ఎవరైనా ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తే లేదా అవినీతి పద్ధతులు అనుసరిస్తే వారి లాగిన్‌లను వెంటనే రద్దు చేయాలి. మెప్మా, గుంటూరు పశ్చిమ లో పూర్తి పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రతి రుణం మంజూరు, సభ్యుల పంపిణీ సమయంలో సంబంధిత డివిజన్ ప్రెసిడెంట్లను, ప్రజా ప్రతినిధులను పాల్గొనేటట్లు చూడాలని అన్నారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి వాటి మినిట్స్ సమర్పించాలనీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

అధికారులు, ఆర్పీలు, సీఈఓలు, ఎవరూ ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదు. ప్రజల ప్రయోజనమే ప్రధాన లక్ష్యం. ఎవరైనా అవినీతిపరంగా వ్యవహరిస్తే వారిని తప్పించడంలో ఎలాంటి సంశయం ఉండదు" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

"ప్రజల కోసం పని చేయడం, న్యాయం చేయడం మన బాధ్యత. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పారదర్శకతతో నిండిన పరిపాలన తప్పనిసరి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

# తిరోగమన నేతలకు రాష్ట్రాభివృద్ధి నచ్చని అంశమే

○ **పట్టణటిడిపి అధ్యక్షులు మహ్మద్ ఖుద్దూస్**



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** తిరోగమన పాలనతో గత వైసిపి ప్రభుత్వం లో,ప్రజలను నయవంచన చేసిన ఘనత వైసీపీ పాలకులదని, నవ్యమైన అభివృద్ధి విధానాల ఊసే వారికి లేదని పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్ ఎద్దేవా చేశారు. స్థానిక రామలింగేశ్వరపేట లోని టీడీపీ కార్యాలయంలో గురువారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఖుద్దూస్ మాట్లాడుతూ ప్రపంచ దిగ్గజ కంపెనీ గూగుల్ సంస్థ విశాఖ రావడాన్ని వైసీపీ శ్రేణులు జీర్ణించుకోలేక పోవడం,వారి దుర్గుణాన్ని తేటతెల్లం చేస్తుందని, చదువుకునె విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం, వారి జీవితాల్లో వెలుగులు నిండడం వైసీపీకి ఏమాత్రం ఇష్టం లేకుండా పోయిందని అన్నారు. జగన్ రెడ్డి తన 5ఏళ్ళ పాలనలో ఒక్క ఫీజు రీయింబర్స్మెంట్,విదేశీ విద్య ఇవ్వకపోగా యువతను గంజాయి, మద్యపానం వంటి వ్యసనాలకు బానిసలుగా చేసిన ఘన చరిత్ర కలిగిన వాడని అన్నారు. రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ పై సుమోటాగా కేసు నమోదు చేయాలని పోలీసు డిపార్ట్మెంట్ ఆవిధంగా ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు. ఐటి, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ను ప్రశ్నించే స్థాయి భరత్ ది కాదని అన్నారు. జిల్లా పార్టీ అధికార ప్రతినిధి జొన్నాదుల మహేష్ మాట్లాడుతూ వైసీపీ అహంకార పాలనతో గాడి తప్పిన రాష్ట్రాన్ని ఒక వైపు గాడిలో పెడుతూ, జిల్లాకొక పరిశ్రమని తీసుకొచ్చే విధంగా కృషి చేస్తుంటే ఓర్చుకోలేక, బురద జల్లుదామని చేస్తున్న ప్రయత్నాలు ప్రజలు ఎప్పటికీ నమ్మరని అన్నారు. బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు ఫణిదపు దుర్గ మాట్లాడుతూ గూగుల్ సంస్థ ద్వారా రాష్ట్రంలో యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల ఉద్యోగాలు రానున్నాయని అవేగాక మరిన్ని పరిశ్రమలు తెచ్చే విధందా సీఎం చంద్రబాబు, యువనేత విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని ఓ వైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం డబుల్ ఇంజన్ సర్కార్ సమ. పాళ్ళలో చేస్తుందని చెప్పారు. భావి తరాలకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా బంగారు బాట వేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని,వైసీపీ ,కుతంత్రాలను, కుట్రపూరిత రాజకీయాలను,రాష్ట్ర యువత నమ్మొద్దని హితవు పలికారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు,అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, రాష్ట్రఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజయ్,దొప్పలపూడి శ్యామ్,పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ సుభాని,రబ్బానీ,ఎన్టీఆర్ జగన్,పెసర్లంక శ్రీను, చైతన్య, నాగూర్, శ్రావణ్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మాయాబజార్ అభివృద్ధికి కృషి



○ **గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మాయాబజార్ ప్రాంతంలో ట్రాపిక్ సమస్యకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలో గురువారం డిప్యూటీ మేయర్ సజీల, సర్కిల్ ఇన్ స్పెక్టర్ అశోక్ తో కలిసి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాయాబజార్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మాయాబజార్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా అడుగు వేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో వందల సంఖ్యలో వ్యాపారులు, కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. అయితే ట్రాఫిక్ సమస్య అధికంగా ఉన్నందున ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నగరంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి స్థానిక అక్రమణలు తొలగించాలని ఈ సందర్భంగా వ్యాపారులను నసీర్ కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చీష్టి, సయ్యద్ అన్వర్, ఎస్ఎస్పీ జాదా, హిదాయతుల్లా, జునేత్, సుభాని, ఫహీముల్లా, ఖాసిం షరీఫ్, కలీం, గఫారి, రసూల్, ఖాజా మొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



○ **మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన స్థానిక నాయకులు**

**మంగళగిరి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ నాయకులు గురువారం లబ్ధిదారులకు అందజేశారు. వీవర్స్‌కాలనీకి చెందిన గోగిరెడ్డి తిరుమల రెడ్డికి రూ. 2 లక్షల 30 వేలు, బాప్టిస్ట్‌పేటకు చెందిన గోలి వాణికి రూ. 60,707 వేలు, లాల్‌బహదూర్ నగర్‌కు చెందిన కుసం రాముకు రూ. 40,000 వేలు, సూర్యనారాయణనగర్‌కు చెందిన పట్టెం లక్ష్మికి రూ. 25,541 వేలు, షరాఫ్‌బజార్‌కు చెందిన చెన్నా శ్యామలకు రూ. 40,350 వేలు, టిప్పర్లబజార్‌కు చెందిన దాసరి స్పందనకు రూ. 38,795 వేల విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి మంత్రి నారా లోకేష్ సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి ఇంటి వద్దకే చెక్కులు పంపిస్తున్నారని చెప్పారు. పేద ప్రజల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కారంపూడి అంకమ్మ రావు, 22 వ వార్డు అధ్యక్షులు కాసిన కొండలరావు, కార్యదర్శి బలభద్ర రమేష్, పట్టణ మహిళా ఉపాధ్యక్షురాలు సింహాద్రి బేబీ రాణి, వడిశా నరేష్, నాగులాపల్లి వెంకన్న, మల్లేశ్వరరావు, వంగర సదాశివరావు, అక్కల హరిబాబు, బాపనపల్లి రవి, బిట్రా శ్రీనివాసరావు, జొన్నాదుల శంకర్, గోలి శ్రీనివాస్, వారు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# 181 మందిపై న్యూసెన్స్ కేసులు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా, ఎస్పీ వకుల్ జిందాల్ సూచనల మేరకు బుధవారం రాత్రి పోలీసు విభాగం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. ఈ సందర్భంగా రాత్రి వేళల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, రోడ్లపై అనవసరంగా తిరుగుతూ ప్రజల భద్రతకు భంగం కలిగించే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 181 మందిపై 173 న్యూసెన్స్ కేసులు నమోదు చేసి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రాత్రి వేళల్లో చట్టవ్యతిరేక చర్యలను అరికట్టడం, ప్రజల శాంతి భద్రతను కాపాడడం ఈ డ్రైవ్ ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

మద్యం సేవించి రాత్రి రోడ్లపై తిరగడం వల్ల గొడవలు, అల్లర్లు, దొంగతనాలు ఎదురయ్యే అవకాశం ఉందని ఎస్పీ హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీ బృందాలను బలోపేతం చేసినట్లు, ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గుర్తించి విచారణలు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

రౌడీ, సస్పెక్ట్ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి, ఏవైనా సంఘటనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలు రాత్రి వేళల్లో తమ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నవారు లేదా శాంతికి భంగం కలిగించే వారిని గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 నంబర్‌కి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. జిల్లా పోలీసులు ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, రాత్రి గస్తీలను మరింత పటిష్టంగా కొనసాగిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు.

# నకిలీ మద్యం నిర్మూలనకు "ఏపీ ఎక్సైజ్ సురక్ష" యాప్

○ **నకిలీ మద్యం గుర్తింపుకు ప్రత్యేక బృందాలు**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** పల్నాడు జిల్లాలో నకిలీ మద్యం నిర్మూలనకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్‌ను ప్రవేశపెట్టినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే. శ్రీనివాస్ తెలిపారు. నరసరావుపేటలోని డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నకిలీ మద్యం గుర్తించే విధానాలు, యాప్ వినియోగం, ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు వంటి వివరాలను వెల్లడించారు. నకిలీ మద్యం గుర్తించడం ఎలా అంటే... మద్యం సీసాపై సీల్ హెూలోగ్రామ్, బార్‌కోడ్ ఉంటాయి. వీటిని స్కాన్ చేస్తే ఎప్పుడు, ఎక్కడ తయారైంది, ఎటు నుంచి వచ్చింది, ఏ దుకాణానికి సరఫరా అయింది వంటి వివరాలు తెలుస్తాయి. నకిలీ మద్యమని తేలితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 14405కు ఫిర్యాదు చేయాలని, 24 గంటల్లోపు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ పేర్కొన్నారు. 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్‌ను సెల్‌ఫోన్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ చేసిన తర్వాత రెండు ఎంపికలు కనిపిస్తాయి – ఒకటి వినియోగదారుల కోసం, మరొకటి మద్యం దుకాణాల నిర్వహణ కోసం. వినియోగదారులు బాటిల్‌పైన ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి 'వెరిఫై ప్రోడక్ట్' ఎంచుకుంటే బ్యాచ్ నంబర్, తయారీ స్థలం, సరఫరా వివరాలు, బ్రాండ్ పేరు, ధర వంటి సమాచారం స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతుంది. నకిలీ మద్యమైతే 'డీటెయిల్స్ నాట్ ఫౌండ్' అని చూపిస్తుంది. ఈ యాప్ ద్వారా సమాచారం జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి డేటాబేస్‌కు చేరుతుంది. కల్తీ మద్యం నిర్మూలనకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు డిపిఈఓ తెలిపారు. జిల్లాలో ఎక్కడా కల్తీ మద్యం లేదని, బార్లు మరియు వైన్ షాపులను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు వెల్లడించారు. పల్నాడు జిల్లాలో 142 లిక్కర్ షాపులు, 32 బార్లు ఉన్నాయి. ఈ యాప్ ద్వారా నాణ్యమైన మద్యం విక్రయాలకు దోహదపడుతుందని, మద్యం బాటిల్‌పై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాతే విక్రయించాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు. జిల్లాలో బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించినట్లు తెలిపారు. ఎవరైనా బెల్ట్ షాపులు నడుపుతుంటే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, మద్యం సరఫరా చేసిన షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. మద్యం దుకాణాల్లో నకిలీ మద్యం ఉందంటూ తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తప్పవని డాక్టర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. అపోహలు, వదంతులు సృష్టించకూడదని, ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌పై అబద్ధాలు ప్రచారం చేసే అవకాశాలు లేవని అన్నారు. ప్రజలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అసలు మద్యం కొనుగోలు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అక్టోబర్ 19న జరిగే పీపీపీ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి

○ **పౌర సంస్థల విజ్ఞప్తి**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ విధానంలోకి మార్చడానికి నిరసిస్తూ ఈనెల 19న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్ లో ఉదయం 10:30 గంటలకు జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయవలసిందిగా పౌర సంస్థల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారంగుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, మాజీ శాసనమండలి సభ్యులు కె.యస్. లక్ష్మణరావు, ప్రముఖ వైద్యులు, ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా. ఆలా వెంకటేశ్వర్లు, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, ఏఐయస్ఎఫ్ రాష్ట్ర నేత యశ్వంత్, దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరరావు పాల్గొని రాష్ట్రసదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. డా. ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు అత్యున్నత ప్రమాణాలతో కొనసాగుతున్నయని, ప్రైవేట్ మెడికల్ కళాశాలలు ధనార్జన కేంద్రాలుగా, అత్యల్ప విద్యా ప్రమాణాలతో ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులు పేద వర్గాలకు వైద్య సేవలందిస్తుండగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య వ్యయం పెరిగి పేదలు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేట్ పరం చేయడం దారుణమన్నారు. మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని లేనిపక్షంలో క్షేత్రస్థాయికి వెళ్లి, ప్రజలను చైతన్యవంతులను చేసి ,ప్రభుత్వ మెడలు వంచుతామని పేర్కొన్నారు. బాగా వెనకబడిన ప్రాంతాలలో పేదలకు వైద్య విద్య, వైద్యం అందించే 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కార్పొరేట్ ఆసుపత్రులకు అందించడం ప్రజా ప్రయోజనాలను కాలరాసినట్లవుతుందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్ లో జరిగే రాష్ట్ర సదస్సును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా. పి.వి. రమేష్ ప్రారంభిస్తారని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్ డా. ఎన్. తులసీ రెడ్డి, మాజీ మంత్రివర్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు లతోపాటు 50 పౌరసంస్థలు, స్వచ్ఛంద సంస్థల రాష్ట్ర నేతలు పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పీ పీ పీ వ్యతిరేక పోరాట ఉద్యమ కమిటీని ఎన్నుకొని ఐక్య ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్ ప్రసంగిస్తూ రాష్ట్రంలో దళిత, గిరిజన, బలహీన వర్గాల ప్రజలకు కనీస వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే దక్కుతుందని, ప్రభుత్వవైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే సహించేది లేదన్నారు. దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరరావు ప్రసంగిస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను యధాతథంగా కొనసాగించేంత వరకు ఉద్యమాన్ని సమిష్టిగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది షిఖా సురేష్, సామాజిక విశ్లేషకులు సాధు మాల్యాద్రి, నల్లమోతు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# శ్రీశైలం మల్లన్న సేవలో ప్రధాని మోదీ - భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లకు పూజలు





శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్):కర్నూలు పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించుకున్నారు. అర్చకులు, ఆలయ అధికారులు ఆయనకు వేద మంత్రోచ్చారణల మధ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, భ్రమరాంబ అమ్మవారు, మల్లికార్జున స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మోదీతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్వామివార్లను దర్శించుకున్నారు. ఇద్దరు నేతలూ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంచామృత రుద్రాభిషేకం – ఖడ్గమాల పూజలు: ప్రధాని మోదీ మల్లికార్జున స్వామివారికి పంచామృతాలతో రుద్రాభిషేకం చేశారు. తరువాత భ్రమరాంబ దేవికి ఖడ్గమాల, కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. తర్వాత శివాజీ స్ఫూర్తి కేంద్రం వైపు ప్రధాని పయనమయ్యారు. పూజల అనంతరం ప్రధాని మోదీ శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి శివాజీ దర్బార్ హాల్, ధ్యాన మందిరాలను ప్రధాని మోదీ తిలకించారు. దేశభక్తి, ధర్మరక్షణకు ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజు స్ఫూర్తి కేంద్రంలోని ప్రదర్శనలపై ఆసక్తి చూపారు. ప్రధాని వెంట చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం నిర్వహణ పట్ల సంతోషం వ్యక్తం చేసిన ప్రధాని, స్ఫూర్తి కేంద్ర నిర్వహణ బాగుందంటూ ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. తర్వాత ప్రధాని మోదీ భ్రమరాంబ గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు.

కర్నూలు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం: శ్రీశైలం చేరుకునే ముందు ప్రధాని కర్నూలు విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఘన స్వాగతం పలికారు. తర్వాత ప్రధాని సైనిక హెలికాప్టర్‌లో శ్రీశైలం వైపు పయనమయ్యారు. ఆయనతో పాటు చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా హెలికాప్టర్‌లో శ్రీశైలం వెళ్లారు. హెలికాప్టర్ సున్నిపెంట హెలీప్యాడ్‌కి చేరుకుంది. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో శ్రీశైలానికి మోదీ చేరుకున్నారు.

లోకేశ్‌తో ప్రధాని సరదా మాటలు: కర్నూలు విమానాశ్రయంలో ప్రధాని మోదీ నారా లోకేశ్‌తో చిన్న సంభాషణ జరిపారు. లోకేశ్‌ను చూసి మోదీ "ఇంతకుముందు కంటే చాలా బరువు తగ్గావు" అని నవ్వుతూ అన్నారు. "త్వరలోనే మీ నాన్న మాదిరిగా తయారవుతావు" అని సరదాగా ప్రశంసించారు. వారిద్దరి మధ్య జరిగిన ఈ స్నేహపూర్వక సంభాషణ అక్కడ ఉన్న నేతల ముఖాల్లో చిరునవ్వులు పుట్టించింది.

సాయంత్రం కర్నూలు సభ: శ్రీశైలం దర్శన అనంతరం ప్రధాని మధ్యాహ్నం కర్నూలు శివారులోని నన్నూరు టోల్‌గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు హాజరవుతారు. ఈ సభలో ప్రధాని 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' కార్యక్రమం విజయవంతంపై ప్రసంగించి, 13,429 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

## జిఎస్టీ పొదుపు ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి




○ వివిధ పోటీల్లో విజేతలకు మంత్రి నారా లోకేష్ అభినందన

కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్) : సూపర్ జిఎస్ టి – సూపర్ సేవింగ్స్ పై కర్నూలు జిల్లాలోని వివిధ స్కూళ్లలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు చెక్ పోస్టు సభావేదిక సమీపాన క్యాంపులో... జిఎస్టీపై నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి లోకేష్ ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించిన లోకేష్ వారిని అభినందించారు. ప్రధాని మోడీజీ నేతృత్వంలో తెచ్చిన జిఎస్టీ సంస్కరణల వల్ల రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఏటా రూ. 15వేల లబ్ధి చేకూరుతుందని, జిఎస్టీ సేవింగ్స్ ప్రయోజనాలపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలని కోరారు.



## బ్రహ్మంగారిమఠం పీఠం వివాదం మళ్లీ తెరపైకి

○ గోవిందస్వామికే అర్హత అంటూ సాధు పరిషత్ తీర్మానం



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) : ప్రపంచ భవిష్యత్తును నిర్దేశించిన కాలజ్ఞాన సృష్టికర్త శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి బ్రహ్మంగారిమఠం ప్రస్తుతం పెద్ద వివాదాన్ని ఎదుర్కొంటోంది. కడప జిల్లా కందిమల్లయపల్లెలో స్వామీజీ జీవసమాధి పొందిన ఈ స్థలం నేడు బ్రహ్మంగారిమఠంగా ప్రసిద్ధి చెందింది. 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ మఠానికి దేశవ్యాప్తంగా లక్షలాది భక్తులు ప్రతి ఏడాది తరలి వస్తారు. ఇంతటి గొప్ప వారసత్వం కలిగిన మఠంలో ఇప్పటివరకు స్వామీజీ కుటుంబ వారసులే 11 మంది పీఠాధిపతులుగా వ్యవహరించారు.

అయితే 2021 మే 8న 11వ పీఠాధిపతి శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి శివైక్యం పొందడంతో పీఠం ఖాళీ అయింది. అప్పటి నుంచి పీఠాధిపతి నియామకం జరగకపోవడంతో మఠ కార్యక్రమాలు సక్రమంగా సాగడం లేదని సాధు పరిషత్ ఆందోళన వ్యక్తం చేసింది. పీఠం లేకుండా నాలుగేళ్లుగా కార్యక్రమాలు నిర్వహించడంపై ప్రశ్నలు లేవనెత్తింది. ఈ వివాదం హైకోర్టు వరకు వెళ్లి, చివరికి కోర్టు ఆరు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. దీంతో బ్రహ్మంగారిమఠం పీఠాధిపత్య సమస్య మళ్లీ చర్చకు వచ్చింది. పీఠంపై వారసుల మధ్య గొడవ ఈ వివాదానికి మూల కారణం. దివంగత వెంకటేశ్వరస్వామికి మొదటి భార్య చంద్రావతమ్మ నుండి నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఆమె మరణంతో ఆయన రెండో వివాహం మారుతీ మహాలక్ష్మితో చేసుకున్నారు. పీఠాధిపతిగా కొనసాగాలంటే దంపతులు ఉండాలనే ఆచారం ఉండటంతో రెండో వివాహం జరిగినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం మొదటి భార్య కుమారుడు వెంకటాద్రి స్వామి తానే పీఠానికి అర్హుడని అంటుండగా, రెండో భార్య మారుతీ మహాలక్ష్మి తనవద్ద వీలునామా ఉందని, తన కుమారుడు గోవిందస్వామికే పీఠం రావాలని పట్టుబడుతున్నారు.

ఈ వ్యవహారంలో ప్రభుత్వ జోక్యం కూడా వివాదాస్పదమైంది. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో నాలుగు సార్లు దేవదాయశాఖ అధికారిని ఫిట్ పర్సన్‌గా నియమించగా, మారుతీ మహాలక్ష్మి ప్రతి సారి హైకోర్టును ఆశ్రయించి ఆ నియామకాలను రద్దు చేయించారు. దీంతో పీఠాధిపతి నియామకంపై స్పష్టత మరింత ఆలస్యం అయింది.

తాజాగా సమస్యను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ స్వామీజీలు కడపకు వెళ్లి పరిశీలనలు జరిపారు. గోవిందస్వామి వేదపాండిత్యం నేర్చుకుంటున్నాడని, వీలునామా ప్రకారం కూడా అతనికే అర్హత ఉందని స్పష్టం చేశారు. సంప్రదాయ పరంగా కూడా అతను పీఠాధిపతిగా అన్ని అర్హతలు కలిగి ఉన్నాడని తేల్చారు.

ఇప్పుడు హైకోర్టు గడువు సమీపిస్తున్న వేళ, ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్నది భక్తులు, ఉన్నత వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. 400 ఏళ్ల చరిత్ర కలిగిన బ్రహ్మంగారిమఠం భవిష్యత్తు కీలక మలుపు దశలో నిలిచింది.

## ప్రధాని సభ విజయవంతం



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ప్రధాన మంత్రి మోడీ కర్నూలు పర్యటన, బహిరంగ సభ విజయవంతం కావడం పట్ల పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్త చేశారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులను ఆయన అభినందించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రూ. 13,500 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేయడానికి కర్నూలు వేదిక కావడం గర్వకాణమని ఆయన పేర్కొన్నారు.

## స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ

○ జూట్ ఉత్పత్తుల తయారీకి నవంబర్ 3 నుంచి శిక్షణ

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సులలో ఉచిత శిక్షణ కల్పించడం జరుగుతుందని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ టి.సందీప్ బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎల్సెల్ ఫోన్ రిపేర్ మరియు సర్వీసెస్, జూట్ ఉత్పత్తుల తయారీ శిక్షణ నవంబరు 3వ తేదీ నుండి, టైలరింగ్ కోర్స్ నవంబరు 17వ తేదీ నుండి ప్రారంభం అవుతాయన్నారు. ఈ శిక్షణలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులు, మహిళలకు జూట్ ఉత్పత్తుల తయారీ, టైలరింగ్ కోర్సులలో., పురుషులకు సెల్ఫోన్ సర్వీసింగ్ లో ప్రవేశం ఉంటుందన్నారు. జూట్ ఉత్పత్తుల తయారీలో 14 రోజుల శిక్షణ, టైలరింగ్ లో 31 రోజులు, సెల్ఫోన్ సర్వీసింగ్ లో 30 రోజులు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణలో ఉచిత భోజన సదుపాయము, ఉచిత హాస్టల్ వసతి కల్పించడం జరుగుతోందని చెప్పారు.

పదవ తరగతి చదివి,19 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ వివరాలను యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు కాపీ, ఆధారకార్డు కాపీ, నాలుగు పాస్పోర్ట్ సైజు ఫోటోలు,10 వ తరగతి విద్యార్హత కాపీని గుంటూరు, కొత్తపేట, ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్, డోర్ నమరు – 14-1-14, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో సమర్పించాలన్నారు. వివరాలకు 08632336912, 9700687696, 8125397953, 9949930155 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని అన్నారు.

## రాష్ట్రంలో మొదటి సారిగా 'ప్యాలియేటివ్ కేర్'లో పీజీ డిగ్రీ

○ విశాఖలోని హోమీబాబా క్యాన్సర్ సెంటర్‌కు అనుమతి



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): దీర్ఘకాలిక చికిత్సతో పాటు రోగికి బాగా నొప్పి కలిగించే వ్యాధులు సంక్రమించినప్పుడు అటువంటి రోగులకు కలిగే తీవ్రమైన నొప్పి నుంచి ఉపశమనం కల్పించడం చాలా అవసరమవుతుంది. ఆ నొప్పిని తగ్గించే ప్రత్యేక చికిత్సా విధానాన్ని ఉపశమన సంరక్షణ(ప్యాలియేటివ్ కేర్) అంటారు. ప్రత్యేక చికిత్సా విధానం మరియు నైపుణ్యతలతో కూడిన ఈ చికిత్సకు సంబంధించి పీజీ డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టడానికి విశాఖపట్నంలోని హోమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి మరియు చికిత్సా కేంద్రానికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అనుమతించారు. దీంతో రాష్ట్రంలో మొదటిసారిగా ఈ పీజీ కోర్సు ప్రారంభంకానుంది. 4 పీజీ సీట్లలో ప్రవేశాలు జరుగుతాయి.

**ఉపశమన చికిత్స :** క్యాన్సర్ వంటి కొన్ని దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమించినప్పుడు రోగులు విపరీతమైన నొప్పితో బాధపడడం వల్ల వారి జీవన నాణ్యత తగ్గిపోతుంది. అటువంటి నొప్పి నుండి ఉపశమనం కల్పించి రోగుల జీవన నాణ్యతను పెంచేందుకు తగిన మందుల వినియోగం, మానసిక సలహాలు, కుటుంబ సభ్యుల సహాయం, ఫిజియోథెరపీ ఉపయోగపడతాయి. నొప్పి తరంగాలు (సిగ్నల్స్) ప్రసరించకుండా చేయడం కూడా ఈ ఉపశమన సంరక్షణలో అంతర్భాగం.

ఉపశమన సంరక్షణలో అందుబాటులోకొస్తున్న ఆధునిక సమగ్ర చికిత్సా విధానాలను పీజీ కోర్సు ద్వారా విస్తరింపచేయడానికి ముందుకొచ్చిన హోమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి మరియు చికిత్సా కేంద్ర నిర్వాహకులను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.

కొద్ది నెలల క్రితం గైనికాలజికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ మరియు మెడికల్ అంకాలజీల్లో నాలుగేసి సీట్లతో సూపర్ స్పెషాలిటీ విద్యను ప్రవేశపెట్టడానికి హోమీ బాబా ఆసుపత్రికి మంత్రి అనుమతించారు.

## జీఎస్టీ 2.0తో సూపర్ సేవింగ్స్ : ఎమ్మెల్యే నసీర్

○ రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే నసీర్




గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): కొత్త జీఎస్టీ రేట్లు అమలులోకి వచ్చిన తర్వాత మొత్తం 375 రకాల వస్తువులు, ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. డైరీ ఉత్పత్తులు, కార్ల నుంచి ఎలక్ట్రానిక్స్ వరకు ధరలు భారీగా తగ్గుతున్నాయని తెలిపారు.

గుంటూరు నగరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఆయా కంపెనీలు ధరల తగ్గింపు ప్రకటనలు చేశాయని తెలిపారు.

గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) సంస్కరణలు సెప్టెంబర్ 22 నుండి అమలులోకి వస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం 5, 18 శాతం పన్ను శ్లాబులను కొనసాగిస్తూ 12, 28 శ్లాబులను తొలగించిందని తెలిపారు. డైరీ ప్రొడక్ట్స్, కార్లు, ఔషధాలు, వంట సామగ్రి నుంచి ఎలక్ట్రానిక్స్ వంటి కు చాలా కేటగిరీల వస్తువుల వరకు ధరలు తగ్గాయని తెలిపారు. ఏ వస్తువుల ధరలు తగ్గుతున్నాయి? ముఖ్యమైన వాటి జాబితా గురించి ప్రజలకు అవగాహన ఉండాలని సూచించారు.

ఆహార పదార్థాల జాబితాలో పాలతో ఉన్న పానియాలు, ఘనీభవించిన పాలు, బిస్కెట్లు, కార్న్ ఫ్లేక్స్, సీరల్స్, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్ పల్ప్, ఫ్రూట్ జూస్, నెయ్యి, ఐస్ క్రీమ్, జామ్, ఫ్రూట్ జెలీస్, కెచప్, ఉప్పు, పనీర్, పాస్ట్రీ, మాంసం, ప్యాకేజ్డ్ కొబ్బరి నీళ్లు ఉన్నాయని వివరించారు. షేవ్ లోషన్, ఫేస్ క్రీమ్, ఫేస్ పౌడర్, హెయిర్ ఆయిల్, షాంపూ, షేవింగ్ క్రీమ్, టాల్కమ్ పౌడర్, టూత్ బ్రస్, టాయిలెట్ సబ్బులు వంటి వాటిపైనా జీఎస్టీ తగ్గిందని తెలిపారు.

## రైతు శ్రేయస్సు కోసం మిర్చి యార్డులో పని చేయండి : కలెక్టర్



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :గుంటూరు మిర్చి యార్డులో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా , జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి గురు వారం పర్యటించారు. మిర్చి యార్డులో కార్యకలాపాలు పరిశీలించారు. రైతు నుండి ఎగుమతిదారు వరకు జరిగే ప్రక్రియను స్వయంగా తనిఖీ చేశారు. రైతుల శ్రేయస్సుకు సహకరించి కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. బిడ్డింగ్ రూమ్ ను పరిశీలించారు. మిర్చి యార్డులో కార్యకలాపాలను మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి, యార్డు ఇన్ ఛార్జ్ సుబ్రహ్మణ్యం, వ్యాపారులు వివరించారు. మిర్చి యార్డులో రైతులు స్వయంగా విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని అన్నారు. 415 మంది ట్రేడర్లు ఉన్నారని తెలిపారు. మార్కెట్ ధరకు అనుగుణంగా ఎగుమతి ధరలు ఉంటాయని వివరించారు. పంట కాలంలో రెండు లక్షల బస్తాల వరకు సరుకు వస్తుందని, మిగిలిన కాలంలో ఏబై వేల బస్తాల వరకు వస్తాయని చెప్పారు. చైనా, థాయిలాండ్, కొలంబో, ఇండోనేసియా, మలేసియా తదితర దేశాలకు ఎక్కువగా ఎగుమతులు జరుగుతాయన్నారు. తేజ రకం ఎగుమతుల్లో ప్రధానమైనది పేర్కొన్నారు. 334, 341 రకం స్థానిక వినియోగానికి ఉపయోగిస్తారని తెలిపారు. గత ఏడాది దిగుబడులు ఎక్కువగా ఉండటం, నాణ్యత కొంత మేర తక్కువగా ఉండటం వలన ధరలు తక్కువగా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో యార్డు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఏ. చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ జిఎస్టిపై ప్రజలకు అవగాహన కల్పిద్దాం

○ సూపర్ సేవింగ్స్ ఉత్సవ్ ను ప్రారంభించిన కలెక్టర్

○ ఈనెల 19 వరకు ఎగ్జిబిషన్ కమ్ సేల్



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ గుంటూరు ఉత్సవ్ ను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ నెల 19వ తేదీ వం-కు గుంటూరు జిల్లా ఉత్సవ్ జరుగుతుంది. ఉత్సవ్ కు ప్రత్యేకంగా లోగో తయారు చేశారు. జి.ఎస్.టి 2.0 పై వినియోగదారులకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఏ.సి కళాశాల ఆడిటోరియం హాల్ లో ఉత్సవ్ ను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్, అమ్మకాలు జరుగుతాయి. ఒక గృహంలో వంట గదిలో అవసరమగు పచ్చళ్ళు, పొడులతో సహా గృహోపకరణాలు, క్రీడా పరికరాలు, జిమ్ ఫిట్నెస్, సోలార్, బుక్స్ స్టేషనరీ, కెమిస్ట్ డ్రగ్గిస్ట్, వ్యవసాయ పరికరాలు, పురుగు మందులు, అన్ని రకాల ఎలక్ట్రానిక్స్ వస్తువులు, వాహనాలు, ట్రాక్టర్లు తదితర దాదాపు 70 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. గుంటూరుకు చెందిన అక్షయ గో నిధి సంస్థ ఏర్పాటు చేసిన ప్రకృతి సహిత సామగ్రి పలువురిని ఆకర్షించింది.

జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఈ సందర్భంగా మాట్లాడుతూ జి.ఎస్.టి తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్య మంత్రి నిర్ణయించడం సంతోషదాయకం అన్నారు. మన రాష్ట్రంలో మాత్రమే అవగాహన కార్యక్రమాలు జరగడం శుభదాయకం అన్నారు. సచివాలయ స్థాయి నుంచి కార్యక్రమాలు జరిగాయన్నారు. రైతు సేవా కేంద్రాలు, పాఠశాలలు, వైద్య కేంద్రాలు తదితర అన్ని శాఖల క్షేత్ర స్థాయిలో నిర్వహించామన్నారు. జి.ఎస్.టి తగ్గింపుతో అన్ని వర్గాలకు గొప్ప ఊరట లభించిందని చెప్పారు. నిత్యావసర వస్తువులు, ఆహారం, మందులు, విద్యా, స్టేషనరీ, బట్టలు, క్రీడా వస్తువులు, మహిళలు, పిల్లలు, రవాణా అంశాలకు సంబంధించి జిఎస్టి తగ్గింపు వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, ఉపాధిహామీ కూలీలు, మత్స్యకారులు, ఆక్వా రైతులు, ట్రేడింగ్ ఎంఎస్ఎంఇలు, నేత, హస్త కళాకారులు, పేపరు – ప్యాకేజింగ్, సెలూన్లు, స్పా, యోగా కేంద్రాలు, జిమ్, టైక్స్ టైల్స్ రంగాల్లో పనిచేసే వారికి, మానవ వనరుల అభివృద్ధి, డిజిటల్ సాంకేతికకు సంబంధించిన విద్య, జీవితబీమా, ఆరోగ్య బీమా, ఎలక్ట్రానిక్స్, ఎంట్రప్రెన్యూర్ షిప్పు, ఇ-కామర్స్ అండ్ గిగ్ ఎకానమీ, కనస్ట్రక్షన్ మెటీరియల్, టూరిజం – హాస్పిటాలిటీ, టాన్సుపోర్టు, లాజిస్టిక్స్, బొమ్మలు, స్పోర్ట్సు గూడ్స్, రెన్యువల్ ఎనర్జీ, ఆటోమొబైల్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో జి.ఎస్.టి తగ్గుదల ఉందన్నారు. జి.ఎస్.టి తగ్గింపుతో సామాన్య కుటుంబాలకు అత్యంత ప్రయోజనం కలుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 4 స్లాబ్ లుగా ఉన్న జి.ఎస్.టిని రెండు స్లాబ్ లుగా తగ్గించిందని చెప్పారు. జి.ఎస్.టి తగ్గింపు వలన రాష్ట్ర ప్రభుత్వానికి ఎనిమిది వేల కోట్ల రూపాయలు ప్రతి ఏటా నష్టం వాటిల్లుతున్నప్పటికీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం దీన్ని బలపరుస్తుందన్నారు. చేనేత కళా రంగంలో ఉన్నవారికి ఇది అత్యంత ప్రయోజనకరంగా ఉందని వారికి కేవలం జీరో శాతంతో జి.ఎస్.టి ఉంటుందన్నారు. పుస్తకాలు, స్టేషనరీ, ఇన్సూరెన్స్, వ్యవసాయ పరికరాలు, ఆరోగ్య సంబంధిత సామాగ్రి, తదితర అనేక అశాలపై అతి తక్కువ జి.ఎస్.టి ఉందన్నారు. వాహనాలు ఎలక్ట్రానిక్ గూడ్స్ పైన ధరలు తగ్గడం జరిగిందని చెప్పారు. ప్రతి కుటుంబానికి నెలకు 2 వేల నుండి రూ. 10 వేల వరకు ఆదా అవుతుందన్నారు. ధరలు తగ్గలేదని పిర్యాదులు రాకూడదని వ్యాపార వర్గాలకు సూచించారు. పిర్యాదులు స్వీకరణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.

డిప్యూటీ మేయర్ షేక్ సజీల మాట్లాడుతూ జి.ఎస్.టి తగ్గింపు గొప్ప ఊరట అన్నారు.

నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు పూర్తి స్థాయిలో అవగాహన పొందాలని, తద్వారా ప్రశ్నించే అవకాశం ఉంటుందని అన్నారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి తెలియాలని ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాలో ఎక్కువ మందిలో అవగాహన వచ్చిందని ఐ.వి.ఆర్.ఎస్ సర్వేలో తేలిందన్నారు. జీఎస్టీలో వచ్చిన పొదుపును మంచి అవసరాలకు ఖర్చు చేయాలని కోరారు.

జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి. గీతా మాధురి మాట్లాడుతూ ప్రతి వస్తువుపై జీఎస్టీ ధరల తగ్గుదల గమనించాలని ప్రజలను కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిఎస్టి సహాయ కమిషనర్ లు ఆర్.అనసూయ, మల్లిఖార్జున రావు, కార్పొరేటర్ సమత, మెప్మ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, ఏ.సి కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467